'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి ‖ సంపుటి : 1 ‖ సంచిక : 60 ‖ బుధవారం ‖ 14.10.2026 ‖ పేజీలు : 8 ‖ వెల రూ. 2

Medchal Malkajgiri ‖ Volume: 1 ‖ Issue: 60 ‖ Wednesday ‖ 14.10.2026 ‖ Pages: 8 ‖ Rate: 2



సింగరేణి కార్మికులకు దసరా ధమాకా!

• ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల నజరానా • రూ.596 కోట్ల లాభాల పంపిణీ

సింగరేణి బొగ్గు గని కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక ప్రకటించింది. సంస్థ లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది. దీంతో 38,737 మంది శాశ్వత ఉద్యోగులకు ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 చొప్పున లాభాల వాటా అందనుంది. ఈ ఏడాది సింగరేణి ఆర్జించిన రూ.1,754 కోట్ల నికర లాభాల్లో రూ.596 కోట్లను కార్మికులకు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. (**వివరాలు 2లో..**)



చినగవు.. తడిసినా పాడవవు!

మీ సేవ సర్టిఫికెట్లకు కొత్త భద్రత!

15 భద్రతా ఫీచర్లతో ప్రత్యేక పేపర్

తెలంగాణలో ప్రభుత్వ ధ్రువపత్రాల భద్రత, మన్నికను పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌ను అందుబాటులోకి తెచ్చింది. చినిగిపోకుండా, నీళ్లు పడినా త్వరగా దెబ్బతినకుండా ప్రత్యేకంగా రూపొందించిన ఈ పేపర్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అక్టోబర్ 13న హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రారంభించారు. (**వివరాలు 2లో..**)



హైదరాబాద్ వాటర్‌పై సర్కార్ ఫోకస్

రాజధానికి అదనంగా 60 ఎంజీడీల నీరు

తాగునీటి సరఫరాకు ప్రభుత్వం కార్యాచరణ

ఎల్‌నినో ప్రభావంతో రిజర్వాయర్లలో నీటి లభ్యత తగ్గే పరిస్థితులను ఎదుర్కొనేందుకు హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. నగర ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. (**వివరాలు 2లో..**)



ఎలివేటెడ్ కారిడార్లకు ఆమోదం

రహదారులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్!

గడ్కరీతో కోమటిరెడ్డి కీలక భేటీ

తెలంగాణలో రహదారి సదుపాయాలను మెరుగుపరిచి, ప్రయాణ సమయాన్ని తగ్గించే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాలకు కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించింది. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై పలు కీలక ప్రాజెక్టులపై చర్చించారు. (**వివరాలు 2లో..**)



ఎస్సీ విద్యార్థులకు విద్యా భరోసా!

32,976 మందికి రూ.204.40 కోట్లు

తెలంగాణలో ఎస్సీ విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి 32,976 మంది విద్యార్థులకు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద రూ.204.40 కోట్లు విడుదల చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.101.44 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.102.96 కోట్లు సమకూర్చాయి. ఈ వివరాలను సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క ఎస్సీ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కళాశాలల నుంచి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, అర్హులకు దశలవారీగా స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిధుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. (**వివరాలు 2లో..**)

అల్లంత దూరంలో అధికారం

సర్‌మంటున్న తెలంగాణ రాజకీయం



వివరాలు 6లో..

◆ ఒకరికి అందని ద్రాక్ష.. ఒకరికి కేక్ వాక్

◆ సీఈసీపై పోరులో ఎవరిది పైచేయి

◆ రాజకీయ చదరంగంలో మునిగేదెవరు?

తెలంగాణ రాజకీయాలు కీలక మలుపులో నిలిచాయి. అధికారం నిలబెట్టుకోవాలని కాంగ్రెస్.. ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని బీజేపీ.. తిరిగి పూనర్వైభవం సాధించాలని బీఆర్ఎస్! మూడు పార్టీల లక్ష్యం ఒక్కటే.. అధికారం! కానీ ఆ దిశగా సాగుతున్న అడుగులు మాత్రం వేర్వేరు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చిచ్చు రేపుతోంది. 75 లక్షల ఓట్ల తొలగింపు జరిగే ప్రమాదం ఉందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు రాజకీయ వేడిని పెంచుతుంటే, ఎన్నికల పారదర్శకతపై ప్రశ్నలతో బీఆర్ఎస్ కూడా పోరుబాట పట్టింది. మరోవైపు, ఎన్నికల ప్రక్రియను ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలకు బీజేపీ తనదైన వాదనతో ఎదురుదాడి చేస్తోంది. ఈ మాటల యుద్ధం మధ్య ప్రజలను వేధిస్తున్న ధరల భారం, పన్నుల పోటు, సంక్షేమ పథకాల అమలు వంటి అసలు సమస్యలు తెరపైకి వస్తున్నాయి. ఖైరతాబాద్ ఉపఎన్నికపై న్యాయపరమైన ఉత్కంఠ.. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలపై అనిశ్చితి.. ఇవన్నీ రాజకీయ సమీకరణాలను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. ఇక్కడ ఒక్క తప్పటడుగు వేసినా భారీ మూల్యం తప్పదనే పరిస్థితి! మరి ఎస్ఐఆర్ వివాదం ఎవరికి అస్త్రం? ఎవరి వ్యూహం ఎవరికి ఉచ్చు? ప్రజల నమ్మకాన్ని గెలుచుకుని అధికార పీఠాన్ని అధిరోహించేది ఎవరు? తెలంగాణ రాజకీయ చదరంగంలో అసలు పైచేయి ఎవరిది?

ప్రపంచ ప్రగతిలో కీలక శక్తి

ఎవరి అభివృద్ధికీ అడ్డంకి కాదు ప్రపంచానికి అండగా ఇండియా: మోదీ



3లో..

ప్రపంచంలోని ఏ దేశం అభివృద్ధికీ భారత్ ఖర్చుతో ఎదగడం లేదని, ప్రపంచంతో కలిసి ప్రపంచ ప్రయోజనాల కోసం ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.



ఎస్ఐఆర్ ఇప్పుడొచ్చింది!

మరి అంతకు ముందు ఎలా ఓడారు?

సర్ సాకుతో కాంగ్రెస్ వైఫల్యాలు దాచలేరు!

2029లోనూ ఓటమి తప్పదన్న అమిత్ షా

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలతో రాజకీయ వేడి పెరిగింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా స్పందించారు. (3లో..)



దీపావళికి కేంద్ర కేబినెట్ విస్తరణ!

మురుగన్ రాజీనామాతో కదలికలు

కేంద్ర మంత్రివర్గంలో కీలక మార్పులకు రంగం సిద్ధమవుతోందా? దీపావళికి ముందే ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్‌ను విస్తరించనున్నారా? కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ అక్టోబర్ 13న తన మంత్రి పదవికి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. (3లో..)



ఓటర్ల జాబితాలో పేరు లేదా..!

◆ లేనివారికి మరో అవకాశం

◆ అక్టోబర్ 15, 16న ప్రత్యేక శిబిరాలు

తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన వారికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పిస్తోంది. అర్హులైన ఓటర్లు జాబితాలో పేరు చేర్చుకునేందుకు అక్టోబర్ 15, 16 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనుంది. తొలిసారి ఓటు హక్కు పొందాలనుకునే యువత కూడా ఈ శిబిరాల్లో ఫామ్ 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ()

ఓటర్ల జాబితాకు పేరుతో కొత్త చిక్కు!

• ఫామ్-6 నిబంధనపై సుప్రీంకోర్టులో సవాల్

• పాత ఓటర్లకు కొత్త దరఖాస్తు ఎందుకు?

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పేర్లు తొలగిపోయిన ఓటర్లు తిరిగి జాబితాలో చేరాలంటే ఫామ్-6 సమర్పించాలన్న నిబంధనపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ విధానం వల్ల గతంలోనే ఓటర్లుగా నమోదైనవారు సైతం తొలిసారి ఓటరు జాబితాలో పేరు చేర్చుకుంటున్నట్లు ప్రకటించాల్సి వస్తోందని పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ()



రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట!



» పరువునష్టం కేసులో విచారణపై స్టే

» 2018 వ్యాఖ్యల కేసులో కీలక ఆదేశాలు

ప్రధాని నరేంద్ర మోదీపై 2018లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కొనసాగుతున్న క్రిమినల్ పరువునష్టం కేసు విచారణకు సుప్రీంకోర్టు తాత్కాలికంగా బ్రేక్ వేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. (**వివరాలు 3లో..**)

అమిత్ షా పరువు నష్టం కేసు

అక్టోబర్ 26న రాహుల్‌పై తుది తీర్పు

ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై నమోదైన పరువునష్టం కేసులో తీర్పు వెలువరించేందుకు ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు అక్టోబర్ 26ను ఖరారు చేసింది. 2018లో బెంగళూరులో ఎన్నికల ప్రచారం సందర్భంగా అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్నది కేసులో ప్రధాన ఆరోపణ. (**వివరాలు 3లో..**)



5లో..

బేగానీ షాదీమే.. వేర్ ఈజ్ ఒవైసీ?

పెళ్లి కాంగ్రెస్‌ది.. ప్రశ్నలు అసద్‌వి!

• ప్రతిపక్షాల నిరసనకు దూరం • ఒక్క సామెతతో రాజకీయ దుమారం

• దేశ రాజకీయాల్లో మజ్లిస్ నయా పంచాయితీ!

రాజకీయ పెళ్లి మొదలైంది.. విపక్ష నేతలంతా ఒక్క చోట చేరారు.. ఎన్నికల సంఘంపై సమరశంఖం పూరించారు! కానీ ఈ రాజకీయ వేదికపై కనిపించని ఒక్క ముఖమే ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆయనే ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ! ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి చేపట్టిన నిరసనకు ఆయన దూరంగా ఉండటమే కాదు.. ఒక్క హిందీ సామెతతో రాజకీయ రచ్చకు తెరలేపారు. "బేగానీ షాదీ మే మేరా క్యా కామ్?" పరాయివారి పెళ్లిలో నాకేం పని? అంటూ సంధించిన ప్రశ్న ఇప్పుడు కాంగ్రెస్ శిబిరానికి సవాలుగా మారిందా? ప్రతిపక్ష ఐక్యతకు ఇది పరీక్షా? లేక తన రాజకీయ అస్తిత్వాన్ని చాటుకునే ఒవైసీ వ్యూహమా? సోషల్ మీడియాలో మీమ్స్ మోత మోగుతుంటే.. రాజకీయ ప్రత్యర్థులు విమర్శల బాణాలు ఎక్కు పెడుతున్నారు. మజ్లిస్ శ్రేణులు మాత్రం ఎదురుదాడికి దిగుతున్నాయి. అసలు ఎన్నికల సంఘంపై ఒవైసీకి అభ్యంతరాలు లేవా? నిరసనకు ఎందుకు దూరంగా ఉన్నారు? ఆహ్వానం అందలేదా.. లేక కూటమి రాజకీయాలకు దూరంగా ఉండటమే ఆయన లక్ష్యమా? సామెత చిన్నదే.. దాని వెనుక రాజకీయ లెక్కలు పెద్దవే! ఈ రచ్చలో అసలు ప్రశ్న మాత్రం ఒక్కటే.. నేతల రాజకీయ ఆధిపత్యమా ముఖ్యం? ప్రజల ఓటు హక్కా ముఖ్యం? తెర వెనుక ఉన్న రాజకీయ సమీకరణాలేంటి?



తమిళనాడు రాజకీయాల్లో బిగ్ ట్విస్ట్

- **మరోసారి ఉప ఎన్నికలకు రంగం సిద్ధం**
- **ఆరు రాజీనామాలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్**
- **స్పీకర్ నిర్ణయానికి న్యాయస్థానం ఆమోదం**

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అధికార టీవీకేలో చేరిన ఆరుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదిస్తూ అసెంబ్లీ స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ తీసుకున్న నిర్ణయాన్ని మద్రాస్ హైకోర్టు సమర్థించింది. 2026 మే 26 నుంచి జూన్ 29 మధ్య సమర్పించిన రాజీనామాలు (**వివరాలు 3లో..**)



ఎస్సీ విద్యార్థులకు విద్యా భరోసా!

32,976 మందికి రూ.204.40 కోట్లు

ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క ఎస్సీ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కళాశాలల నుంచి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, అర్హులకు దశలవారీగా స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిధుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు నిధులు

విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఫీజు బకాయిల చెల్లింపుల కోసం ప్రభుత్వం మరో రూ.14.68 కోట్లు విడుదల చేసింది. పెండింగ్ బకాయిల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్కాలర్‌షిప్‌ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్య, సంక్షేమానికి అవసరమైన నిధులను సమకూరుస్తూ, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులకు చేరేలా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు.



చినగవు.. తడిసినా పాడవవు!

- మీ సేవ సర్టిఫికెట్లకు కొత్త భద్రత!
- 15 భద్రతా ఫీచర్లతో ప్రత్యేక పేపర్

తెలంగాణలో ప్రభుత్వ ధ్రువపత్రాల భద్రత, మన్నికను పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌ను అందుబాటులోకి తెచ్చింది. చినిగిపోకుండా, నీళ్లు పడినా త్వరగా దెబ్బతినకుండా ప్రత్యేకంగా రూపొందించిన ఈ పేపర్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అక్టోబర్ 13న హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్, విజయ రమణారావు, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ టి. రవికిరణ్, అధికారులు, ప్రింటింగ్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. కొత్త పేపర్‌లో 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లు పొందుపరిచారు. నకిలీ ధ్రువపత్రాల తయారీని, అనధికార నకళ్లను అరికట్టేలా వీటిని రూపొందించారు. భద్రతా కారణాలతో ఆ ఫీచర్ల పూర్తి వివరాలను ప్రభుత్వం వెల్లడించలేదు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన ఈ పేపర్ ఎక్కువకాలం భద్రంగా ఉండటంతో పాటు సాధారణ పరిస్థితుల్లో లామినేషన్ అవసరాన్ని కూడా తగ్గిస్తుంది.

జీవితాంతం భద్రంగా పత్రాలు!

జనన, మరణ ధ్రువపత్రాలు, విద్యా, ఉద్యోగ సంబంధిత సర్టిఫికెట్లు ప్రజల జీవితాల్లో కీలకమని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కొన్ని అధికారిక పత్రాలను జీవితాంతం భద్రపరచాల్సి ఉంటుందని, అవి త్వరగా పాడవకుండా చూడటం ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవల్లో నాణ్యత, భద్రత, సౌలభ్యం పెంచేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. కొత్త పేపర్‌తో సర్టిఫికెట్ల మన్నిక పెరగడమే కాకుండా వాటి విశ్వసనీయతకు మరింత రక్షణ లభిస్తుందని చెప్పారు.

2011 నుంచి భద్రతా పేపర్ వినియోగం

తెలంగాణలో 2011 నుంచి మీ సేవ సర్టిఫికెట్ల ముద్రణకు ప్రత్యేక సెక్యూరిటీ పేపర్‌ను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం దాని స్థానంలో మరింత నాణ్యత, భద్రత, మన్నిక కలిగిన కొత్త పేపర్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ముఖ్యంగా జనన, మరణ ధ్రువపత్రాలు సహా దీర్ఘకాలం భద్రపరచాల్సిన ప్రభుత్వ పత్రాలకు ఇది ఉపయోగపడనుంది. ధ్రువపత్రాలు పాడవకుండా కాపాడటంతో పాటు నకిలీలను నిరోధించడం, ప్రభుత్వ పత్రాలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచడం ఈ మార్పు ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.



ఎలివేటెడ్ కారిడార్లకు ఆమోదం

- రహదారులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్!
- గడ్కరీతో కోమటిరెడ్డి కీలక భేటీ

ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం లభించగా, హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్ 65ను 6+2 లేన్లుగా విస్తరించే పనులను 2027 జనవరిలో ప్రారంభిస్తామని గడ్కరీ హామీ ఇచ్చారు. నవంబర్‌లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కృష్ణా నదిపై సోమశిల-సంగమేశ్వరం మధ్య ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు కూడా అంగీకారం తెలిపారు. ఈ వంతెనతో తిరుపతి ప్రయాణంలో సుమారు 80 కిలోమీటర్ల దూరం, మూడు గంటల సమయం ఆదా అవుతుందని మంత్రి వివరించారు. హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని కేంద్ర మంత్రి అధికారులను ఆదేశించారు.

రోప్‌వేలు, ఆర్ఓబీలకు ఆమోదం

తెలంగాణలో పర్యాటక అభివృద్ధికి పర్వతమాల పథకం కింద ఐదు రోప్‌వేలు, సేతు బంధన్ పథకం కింద మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్ఓబీ) నిర్మాణానికి ఆమోదం లభించింది. హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనపైనా గడ్కరీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలోని 34 రహదారి పనులకు సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) నిధుల కోసం మంత్రి చేసిన విజ్ఞప్తిపై సంబంధిత కేంద్ర అధికారులకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పుల్లూరు నుంచి అలంపూర్, కొల్లాపూర్, అచ్చంపేట, దేవరకొండ మీదుగా నల్గొండ వరకు పలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదనను కూడా కోమటిరెడ్డి ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టులు అమలైతే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభించనుంది.

ప్రయాణ సౌకర్యాలే ప్రధాన లక్ష్యం

హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22 వరకు జరగనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) సమావేశాలకు హాజరుకావాలని కోమటిరెడ్డి గడ్కరీని ఆహ్వానించగా, ఆయన సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో రహదారి అనుసంధానాన్ని బలోపేతం చేయడం, ప్రమాదాలను తగ్గించడం, ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కోమటిరెడ్డి తెలిపారు. మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర సహకారం అందడం తెలంగాణ అభివృద్ధికి కీలక ముందడుగు అని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో పాటు కేంద్ర, రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు దసరా ధమాకా!

- ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల నజరానా
- రూ.596 కోట్ల లాభాల పంపిణీ



సింగరేణి బొగ్గు గని కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక ప్రకటించింది. సంస్థ లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది. దీంతో 38,737 మంది శాశ్వత ఉద్యోగులకు ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 చొప్పున లాభాల వాటా అందనుంది. ఈ ఏడాది సింగరేణి ఆర్జించిన రూ.1,754 కోట్ల నికర లాభాల్లో రూ.596 కోట్లను కార్మికులకు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. మరోవైపు 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 బోనస్ చెల్లించనున్నారు. ప్రజాభవన్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క ఈ వివరాలు ప్రకటించారు. కార్మికుల సంక్షేమంతో పాటు సంస్థ భవిష్యత్తుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని, నెహ్రూ హౌసింగ్ కాలనీ ఏర్పాటుపైనా దృష్టి పెట్టామని చెప్పారు.

పెండింగ్ సమస్యలకు 15 రోజుల్లో పరిష్కారం

సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న 250 నుంచి 300 డిపెండెంట్ ఉద్యోగ ఉత్తర్వుల సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు భట్టి తెలిపారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించిన 136 నుంచి 170 వరకు పెండింగ్ కేసులను మానవీయ కోణంలో పరిశీలించాలని సూచించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ పరీక్షల కోసం కొత్తగూడెం వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని ఏరియా ఆసుపత్రుల్లో వైద్య బోర్డు సమావేశాలు నిర్వహించనున్నారు. విధులకు గైర్హాజరై ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల సమస్యలను వన్‌టైమ్ ఆఫర్ ద్వారా పరిష్కరించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. కార్మికులకు సేఫ్టీ కిట్లు, మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. అత్యవసర వైద్యం కోసం కార్డియాక్, క్యాథ్ ల్యాబ్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, బొగ్గు గనుల ప్రభావిత గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆక్రమిత నివాస ప్రాంతాల్లో అర్హుల గుర్తింపును నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

కొత్త బొగ్గు బ్లాక్‌లతో సంస్థకు బలం

సింగరేణి లాభాలు తగ్గడానికి గత పదేళ్లలో కొత్త బొగ్గు బ్లాక్‌లు సాధించకపోవడం, కొన్ని బ్లాక్‌లు మూతపడటం కారణమని భట్టి విక్రమార్క విమర్శించారు. కేంద్రం వేలం వేసిన సుమారు 141 బ్లాక్‌లలో సంస్థ పాల్గొనే అవకాశాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం వినియోగించుకోలేదని ఆరోపించారు. తాడిచర్ల 2, కోయగూడెం 3, మణుగూరు పీకే ఓసీ 2 డిప్‌సైడ్, నైనీ బ్లాక్‌ల సాధనపై తమ ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. మార్కెట్‌కు అనుగుణంగా బొగ్గు ధరలను సర్దుబాటు చేయడంతో పాటు విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన బకాయిలను దశలవారీగా వసూలు చేస్తామని తెలిపారు. మరోవైపు, సింగరేణిని పదేళ్లు నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు పోరుబాట పేరుతో ఆందోళనలు చేయడం హాస్యాస్పదమని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. కార్మికుల సమస్యలను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, కుటుంబాల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని ఇద్దరు మంత్రులు స్పష్టం చేశారు.



ఓటర్ల జాబితాలో పేరుందా..! లేనివారికి మరో అవకాశం

అక్టోబర్ 15, 16న ప్రత్యేక శిబిరాలు

తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన వారికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పిస్తోంది. అర్హులైన ఓటర్లు జాబితాలో పేరు చేర్చుకునేందుకు అక్టోబర్ 15,16 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనుంది. తొలిసారి ఓటు హక్కు పొందాలనుకునే యువత కూడా ఈ శిబిరాల్లో ఫామ్ 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం జారీ చేసిన మెమో ప్రకారం, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) శిబిరాల్లో అందుబాటులో ఉంటారు. జాబితాలో అర్హులైన ఓటర్లందరికీ చోటు కల్పించేలా జిల్లా ఎన్నికల అధికారులు, ఓటరు నమోదు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

ఇంటింటి సర్వేతో ఓటర్ల గుర్తింపు

గతంలో ఓటర్ల జాబితాలో పేరుండి, తాజా ముసాయిదాలో తొలగించబడిన వారి వివరాలను బీఎల్ఓలు గుర్తించాలి. ఇంటింటికీ వెళ్లి అర్హతను పరిశీలించి, అవసరమైన వారికి ఫామ్ 6 దరఖాస్తు సమర్పించడంలో సహకరించాలి. ప్రతి బీఎల్ఓ వారానికి కనీసం 20 నుంచి 25 మంది ఓటర్లను పరిశీలించి, నెల రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలి. గుర్తించిన వారి జాబితాలు, దరఖాస్తులు, క్షేత్రస్థాయి నివేదికలను సంబంధిత అధికారులతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయాలి. నిరాశ్రయులు, రాత్రి ఆశ్రయ కేంద్రాల్లో నివసించేవారు, కార్మిక కాలనీల్లో ఉండేవారు, అణగారిన వర్గాల ప్రజల కోసం ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించాలని కూడా ఎన్నికల అధికారులు సూచించారు. అర్హులెవరూ ఓటు హక్కు కోల్పోకుండా విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు.

నవంబర్ 7 వరకు నమోదు అవకాశం

దావాలు, అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసినప్పటికీ తెలంగాణలో ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని అధికార వర్గాలు తెలిపాయి. నవంబర్ 7 వరకు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందని వెల్లడించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కొనసాగుతుంది. అయితే నవంబర్ 7 తర్వాత పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు తుది ఓటర్ల జాబితాలో ప్రతిబింబించవని అధికారులు స్పష్టం చేశారు. అలాంటి దరఖాస్తుదారులు కూడా ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హులుగానే ఉంటారని తెలిపారు. అందువల్ల ముసాయిదా జాబితాలో పేరు లేని వారు, తొలిసారి ఓటు హక్కు పొందాలనుకునేవారు గడువులోగా దరఖాస్తు చేసుకోవడం కీలకం.

ఓటర్ల జాబితాకు పేరుతో కొత్త చిక్కు!

ఫామ్-6 నిబంధనపై సుప్రీంకోర్టులో సవాల్

పాత ఓటర్లకు కొత్త దరఖాస్తు ఎందుకు?

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పేర్లు తొలగిపోయిన ఓటర్లు తిరిగి జాబితాలో చేరాలంటే ఫామ్-6 సమర్పించాలన్న నిబంధనపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ విధానం వల్ల గతంలోనే ఓటర్లుగా నమోదైనవారు సైతం తొలిసారి ఓటరు జాబితాలో పేరు చేర్చుకుంటున్నట్లు ప్రకటించాల్సి వస్తోందని పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫామ్-6 ప్రధానంగా కొత్త ఓటర్ల నమోదు కోసం ఉద్దేశించినదని, ఇప్పటికే ఓటర్లుగా ఉన్నవారికి ఈ నిబంధన వర్తింపజేయడం చట్టపరమైన ప్రాథమిక వైరుధ్యానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ఢిల్లీలో ఎస్ఐఆర్ గణన దశలో గత ఓటర్ల జాబితాలోని 47,56,722 మంది పేర్లను 'గైర్హాజరు, వలస, మరణం లేదా నకిలీ నమోదు' (ఏఎస్‌డీఈ) కేటగిరీ కింద ముసాయిదా జాబితా నుంచి తొలగించారు. వీరి పేర్లను తిరిగి చేర్చుకునేందుకు ఫామ్-6 ఒక్కటే మార్గంగా ఉందని పిటిషన్ పేర్కొంది.

తప్పుడు ప్రకటనతో శిక్ష పడే ప్రమాదం

గతంలో ఓటర్లుగా నమోదైనవారితో తొలిసారి నమోదు చేసుకుంటున్నామని ప్రకటన చేయించడం వాస్తవాలకు విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 31 ప్రకారం తప్పుడు ప్రకటన చేసినట్లు తేలితే జరిమానా లేదా జైలు శిక్ష ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఎస్ఐఆర్ జాబితాతో ఓటరుకు ఉన్న సంబంధాన్ని వివరించే అదనపు డిక్లరేషన్‌పైనా అభ్యంతరం తెలిపారు. ఈ ప్రకటనకు చట్టబద్ధమైన ఆధారం లేదని, దానిని రద్దు చేయాలని కోరారు. ఓటర్ల నమోదు నిబంధనలను రూపొందించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, సంబంధిత నియమాలను పార్లమెంటు ఉభయ సభల ముందుంచే ప్రక్రియను చట్టం నిర్దేశిస్తుందని పిటిషన్ గుర్తుచేసింది. అయితే అదనపు డిక్లరేషన్ విషయంలో ఆ ప్రక్రియను అనుసరించలేదని పేర్కొంది.

ఒకే ప్రక్రియకు వేర్వేరు నిబంధనలా?

ఎస్ఐఆర్ మార్గదర్శకాల్లో అదనపు డిక్లరేషన్ నిబంధనను పలుమార్లు మార్చారని పిటిషనర్లు తెలిపారు. ఎస్ఐఆర్ జరగని సమయంలో ఆ ప్రకటన అవసరం లేదని ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణతో ఒకే ప్రయోజనం కోసం వేర్వేరు విధానాలు అమలవుతున్నాయని వాదించారు. ఇది చట్టపరంగా సమర్థనీయం కాదని పేర్కొన్నారు. పారదర్శకత కార్యకర్తలు అంజలి భరద్వాజ్, అమృత జోహ్రే ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఢిల్లీలో ఎస్ఐఆర్ ప్రక్రియలో తార్కిక వ్యత్యాసాల పేరుతో తీసుకుంటున్న నిర్ణయాలను సవాల్ చేస్తూ వీరు గతంలోనే మరో పిటిషన్ వేశారు. పేర్లు తొలగించిన ఓటర్ల పునఃనమోదు ప్రక్రియ చట్టబద్ధత, అదనపు డిక్లరేషన్ అవసరం ఇప్పుడు సుప్రీంకోర్టు పరిశీలనకు వచ్చిన కీలక అంశాలుగా మారాయి.



హైదరాబాద్ వాటర్‌పై సర్కార్ ఫోకస్

- రాజధానికి అదనంగా 60 ఎంజీడీల నీరు
- తాగునీటి సరఫరాకు ప్రభుత్వం కార్యాచరణ



మంగళవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో నీటి సరఫరా సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, మంజీరా, కృష్ణా, గోదావరి వనరుల ద్వారా 560 ఎంజీడీల నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. నగర అవసరాల కోసం కృష్ణా నుంచి 15 ఎంజీడీలు, మిషన్ భగీరథ ద్వారా అదనంగా 40 ఎంజీడీలు, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల నుంచి మరో 5 ఎంజీడీలు కలిపి మొత్తం 60 ఎంజీడీల అదనపు నీటిని వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించారు. మల్లన్నసాగర్‌లో 5 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, నవంబర్‌లో పైప్‌లైన్ పనులు పూర్తయితే అక్కడి నుంచి మరో 20 ఎంజీడీల నీటిని తరలించే అవకాశం ఉంటుందని తెలిపారు.

20 శాతం పాడుపుతో భారీ ఆదా

గత రెండు మూడు నెలలుగా భూగర్భ జలమట్టాలు పడిపోవడంతో నీటి ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందని అధికారులు గుర్తించారు. నగరంలోని అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని సీఎస్ ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని తోటల నిర్వహణ, వాహనాల శుభ్రత వంటి గృహేతర అవసరాలకు వినియోగించాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక గ్రీన్ ట్యాంకర్లను ఏర్పాటు చేస్తున్నట్లు జలమండలి తెలిపింది. మంజీరా, సింగూరు జలాలపై ఆధారపడే మెదక్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించినట్లు వెల్లడించారు. మూడు కార్పొరేషన్ల పరిధిలో 20 శాతం నీటిని ఆదా చేస్తే రోజుకు 80 ఎంజీడీలు పొదుపు చేయవచ్చని సంజయ్ జాజు పేర్కొన్నారు. తాగునీటితో వాహనాలు కడగడం, నీటిని వృథా చేయడం అరికట్టాలని ఆదేశించారు. నీటి పొదుపుపై 60 రోజులపాటు ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, సినీ ప్రముఖులను భాగస్వాములను చేయాలని సూచించారు.

నిధుల కొరత లేదు.. సీఎస్ భరోసా

తాగునీటి సరఫరాకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అవసరమైన నిధులకు కొరత లేదని సంజయ్ జాజు స్పష్టం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు నిరంతర సరఫరా అందించాలని ఆదేశించారు. నీటి లభ్యత తగ్గే పరిస్థితుల్లో ప్రతి చుక్కను విలువైన వనరుగా భావించి పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ చర్యలకు ప్రజల సహకారం తోడైతే ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవచ్చని ఆయన పేర్కొన్నారు.



యెమెన్ చమురు కేంద్రంపై సౌదీ ఎటాక్!

దాడులకు కాచుకోవాలని హౌతీల వార్నింగ్


యెమెన్‌లో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. హూతీల ఆధీనంలోని రాజధాని సనాలో ఉన్న అల్‌సబాహా చమురు కేంద్రంపై సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు వైమానిక దాడి చేసినట్లు హూతీ వర్గాలు ప్రకటించాయి. దాడికి ముందు ఆ ప్రాంతంలోని పౌరులు ఖాళీ చేయాలని సంకీర్ణ దళాలు హెచ్చరించినట్లు సమాచారం. దాడి అనంతరం చమురు కేంద్రం నుంచి దట్టమైన నల్లటి పొగలు ఎగిసిపడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. పేలుడు శబ్దాలు వినిపించినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఈ దాడిపై సౌదీ సంకీర్ణ దళాల నుంచి అధికారిక ధ్రువీకరణ వెలువడలేదు. చమురు నిల్వలు, పౌరుల సరఫరాలకు ఎలాంటి అంతరాయం ఉండదని యెమెన్ పెట్రోలియం కంపెనీ వెల్లడించింది.

రియాద్‌పై ప్రతిదాడికి హూతీల హెచ్చరిక

సౌదీ దాడికి ప్రతిగా తీవ్ర చర్యలు తీసుకుంటామని హూతీ సైనిక ప్రతినిధి యాహ్యా సరీఅ హెచ్చరించారు. రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, చమురు శుద్ధి కేంద్రం, దమ్మామ్‌లోని అరామ్‌కో కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని ప్రకటించారు. మరోవైపు సౌదీ రాజధాని సమీపంలో హూతీల క్షిపణిని అడ్డుకున్నట్లు సంకీర్ణ దళాలు గతంలో వెల్లడించాయి. విమానాశ్రయంపై జరిగిన దాడిలో భారతీయుడితో సహా 13 మంది మరణించినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. అనంతరం విమానాశ్రయ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ పరిణామాలతో సౌదీలోని తమ పౌరులు అప్రమత్తంగా ఉండాలని పలు దేశాలు సూచించాయి.

ఎస్ఐఆర్ ఇప్పుడొచ్చింది!

- మరి అంతకు ముందు ఎలా ఓడారు?
- సర్ సాకుతో కాంగ్రెస్ వైఫల్యాలు దాచలేరు!
- 2029లోనూ ఓటమి తప్పదన్న అమిత్ షా



ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలతో రాజకీయ వేడి పెరిగింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నవేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా స్పందించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ 2024 తర్వాతే ప్రారంభమైందని, రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ ఎన్నికల్లో ఓడిపోతూనే ఉందని విమర్శించారు. గుజరాత్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎస్ఐఆర్‌ను సాకుగా చూపుతోందని ఆరోపించారు.

గాంధీనగర్‌లో బీజేపీ జోరు.. మోదీకి ప్రజాదరణ


గుజరాత్ రాజధాని గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 44 స్థానాలకు గాను బీజేపీ 38 స్థానాలను కైవసం చేసుకుని ఘన విజయం సాధించింది. థారా, ఓఖా మున్సిపాలిటీల్లోనూ అధికారాన్ని నిలబెట్టుకుంది. గత ఎన్నికలతో పోలిస్తే గాంధీనగర్‌లో బీజేపీ ఓట్ల శాతం 10 శాతం పెరిగిందని అమిత్ షా పేర్కొన్నారు. గుజరాత్‌లో 41 ఏళ్లుగా కాంగ్రెస్ ఒక్క ఎన్నికలోనూ విజయం సాధించలేదని వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిలో జరిగిన ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ఒక్క సీటు దక్కలేదని గుర్తుచేశారు. ప్రజల మద్దతు బీజేపీకి, ప్రధాని నరేంద్ర మోదీకి ఉందని పేర్కొంటూ, 2029 లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రతిపక్షాలకు మరోసారి ఓటమి తప్పదని జోస్యం చెప్పారు.

ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ అభ్యంతరం

అమిత్ షా వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత, రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వీ తప్పుబట్టారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ ఓటములకు ఎస్ఐఆర్‌పై తమ అభ్యంతరాలకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాల సవరణను తాము వ్యతిరేకించడం లేదని, అయితే బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రత్యేక సవరణ చేపట్టడంపైనే హాలున్నాయని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా నుంచి ఒక్కరి పేరు తొలగినా, ఆ ప్రభావం వారి కుటుంబంపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రపంచ ప్రగతిలో కీలక శక్తి

- ఎవరి అభివృద్ధికీ అడ్డంకి కాదు
- ప్రపంచానికి అండగా ఇండియా: మోదీ



ప్రపంచంలోని ఏ దేశం అభివృద్ధికీ భారత్ ఖర్చుతో ఎదగడం లేదని, ప్రపంచంతో కలిసి ప్రపంచ ప్రయోజనాల కోసం ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అక్టోబర్ 13న న్యూఢిల్లీలో జరిగిన బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో ఆయన ప్రసంగిస్తూ, అంతర్జాతీయ అనిశ్చితి పరిస్థితుల్లో భారత్ విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రపంచానికి స్థిరమైన అండ అవసరమైనప్పుడు భారత్ తన బాధ్యతను గుర్తించి సహకారం అందిస్తుందని చెప్పారు. ప్రపంచ ప్రగతికి భారత్ ఎదుగుదల తోడ్పడాలన్నదే తమ విధానమని వివరించారు. దేశంలో చేపడుతున్న సంస్కరణలు తప్పనిసరి పరిస్థితుల వల్ల కాకుండా, అభివృద్ధిపై ఉన్న నమ్మకంతో అమలు చేస్తున్నవని వెల్లడించారు.

ఆర్థిక వృద్ధికి బలమైన పునాదులు

భారత్ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని వివరించేందుకు మోదీ పలు గణాంకాలను ప్రస్తావించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశ ఆర్థిక వృద్ధి 7.8 శాతంగా నమోదైందని తెలిపారు. కరెంట్ అకౌంట్ లోటు 0.61 శాతంగా ఉండగా, విదేశీ మారక నిల్వలు 700 బిలియన్ డాలర్లను దాటాయని పేర్కొన్నారు. దేశ బ్యాంకింగ్ వ్యవస్థ కూడా బలంగా ఉందని చెప్పారు. ఈ ఆర్థిక స్థిరత్వం కారణంగా అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు భారత్ సార్వభౌమ రేటింగ్‌ను మెరుగుపరుస్తున్నాయని వివరించారు. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ద్వారా పన్నుల విధానం సరళీకరణ, దివాలా చట్టాల అమలు, కార్మిక చట్టాల ఏకీకరణ, వ్యాపారాలకు సంబంధించిన చిన్నపాటి నేరాల విచారణలో నేరపూరిత చర్యల తొలగింపు వంటి సంస్కరణలను ఆయన ప్రస్తావించారు.

ఇతరుల అభివృద్ధికీ భారత్ తోడ్పాటు

కేవలం పోటీపడి విజయం సాధించడమే కాకుండా, ఇతరులు కూడా ఎదిగేందుకు సహకరించడమే నిజమైన శక్తి అని మోదీ పేర్కొన్నారు. 'పవర్ టు ఎంపవర్' అనే సూత్రాన్ని భారత్ పాలనలో, పని విధానాల్లో అనుసరిస్తోందని వివరించారు. కరోనా సమయంలో ప్రపంచ దేశాలకు టీకాలు సరఫరా చేయడం, కృత్రిమ మేధస్సును జంతు సంక్షేమం వంటి రంగాల్లో ఉపయోగించడంపై చర్చలు జరగడం దీనికి ఉదాహరణలుగా పేర్కొన్నారు. భారత్ మరింత బలపడితే మానవాళికి, ప్రపంచానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని అన్నారు. దేశాల మధ్య సంభాషణ, పరస్పర అవగాహన పెరిగితే అంతర్జాతీయ సమస్యలకు ఉమ్మడి పరిష్కారాలు కనుగొనవచ్చని చెప్పారు. భారత్ అభివృద్ధి తనకే పరిమితం కాకుండా ప్రపంచానికి కొత్త అవకాశాలను సృష్టించాలన్నదే ప్రధాని ప్రసంగంలోని ప్రధాన సందేశం.

అమిత్ షా పరువు నష్టం కేసు

- అక్టోబర్ 26న రాహుల్‌పై తుది తీర్పు

ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై నమోదైన పరువునష్టం కేసులో తీర్పు వెలువరించేందుకు ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు అక్టోబర్ 26ను ఖరారు చేసింది. 2018లో బెంగళూరులో ఎన్నికల ప్రచారం సందర్భంగా అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు, ప్రస్తుతం కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్నది కేసులో ప్రధాన ఆరోపణ. ఆ రోజు రాహుల్ గాంధీ కోర్టుకు హాజరుకావాల్సి ఉంటుందని ఫిర్యాదుదారు తరపు న్యాయవాది సంతోష్ కుమార్ పాండే తెలిపారు. ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు అదనపు సివిల్ జడ్జి శుభమ్ వర్మ తీర్పు తేదీని నిర్ణయించారు.

2018లో ఫిర్యాదు.. 2023లో విచారణ

బీజేపీ నేత, జిల్లా సహకార బ్యాంకు మాజీ చైర్మన్ విజయ్ మిశ్రా 2018 ఆగస్టు 4న రాహుల్‌పై పరువునష్టం ఫిర్యాదు చేశారు. 2023 నవంబర్ 27న కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేయగా, ఆయన హాజరై బెయిల్ పొందారు. కేసులో భాగంగా రాహుల్ గొంతు నమూనాను పోల్చాలని విజయ్ మిశ్రా దాఖలు చేసిన పిటిషన్‌ను ట్రయల్ కోర్టు తిరస్కరించింది. ఆ నిర్ణయంపై సెషన్స్ కోర్టులో వేసిన పిటిషన్ కూడా కొట్టివేయబడింది. అనంతరం అలహాబాద్ హైకోర్టు సైతం దిగువ కోర్టుల ఉత్తర్వులను సవాల్ చేసిన మిశ్రా పిటిషన్‌ను తిరస్కరించింది. అక్టోబర్ 26న వెలువడే తీర్పుపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

డీఎస్సీ షార్ట్ నోటిఫికేషన్

- ఏపీలో 2,721 టీచర్ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్!

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. మొత్తం 2,721 పోస్టుల భర్తీకి డీఎస్సీ షార్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో జనరల్ పాఠశాలల్లో ఎస్జీటీ, ఎస్ఏ విభాగాలకు సంబంధించి 2,111 పోస్టులు, స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో 350 పోస్టులు, సోషైటీల పరిధిలో ప్రిన్సిపల్స్, పీజీటీ, పీడీ, టీజీటీ కేటగిరీల్లో మరో 260 పోస్టులు ఉన్నాయి. మూడు వారాల తర్వాత పూర్తి నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో పరీక్షల షెడ్యూల్, విద్యార్హతలు, వయోపరిమితి, దరఖాస్తుల ప్రక్రియ, ఫీజు వివరాలు, హాల్‌టికెట్లకు సంబంధించిన సమాచారం వెల్లడించనున్నారు. పూర్తి నోటిఫికేషన్ వెలువడిన తర్వాత అభ్యర్థులు నిబంధనలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.



తమిళనాడు రాజకీయాల్లో బిగ్ ట్విస్ట్

- మరోసారి ఉప ఎన్నికలకు రంగం సిద్ధం
- ఆరు రాజీనామాలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్
- స్పీకర్ నిర్ణయానికి న్యాయస్థానం ఆమోదం

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అధికార టీవీకేలో చేరిన ఆరుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదిస్తూ అసెంబ్లీ స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ తీసుకున్న నిర్ణయాన్ని మద్రాస్ హైకోర్టు సమర్థించింది. 2026 మే 26 నుంచి జూన్ 29 మధ్య సమర్పించిన రాజీనామాలు స్వచ్ఛందంగా, నిజమైనవేనని ధర్మాసనం పేర్కొంది. ఎమ్మెల్యేలు స్వయంగా స్పీకర్‌కు అందించిన చేతిరాత రాజీనామాలపై వాటి వెనుక ఉద్దేశాలను పరిశీలిస్తూ విస్తృత విచారణ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. రాజీనామాల ఆమోదం, వాటి వల్ల ఏర్పడిన ఖాళీల ప్రకటన రాజ్యాంగబద్ధమేనని తీర్పు చెప్పింది. అనర్హత వేటు ప్రక్రియ పెండింగ్‌లో ఉన్నప్పటికీ రాజీనామాలను ఆమోదించే అధికారం స్పీకర్‌కు ఉందని తెలిపింది. అయితే, ఈ రెండు ప్రక్రియలు వేర్వేరని పేర్కొంటూ అనర్హత విచారణను నిలిపివేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది.

నలుగురి అనర్హతపై రెండు నెలల్లో నిర్ణయం

అనర్హత వేటు ఎదుర్కొంటున్న ఎసక్కి సుబ్బయ్య, ఎస్. జయకుమార్, మరగతం కుమారవేల్, పి. సత్యబామా వ్యవహారంలో స్పీకర్ నాలుగు నెలలుగా నిర్ణయం తీసుకోకపోవడంపై ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. వీరిలో మరగతం కుమారవేల్, సత్యబామా ఇటీవల అదే నియోజకవర్గాల నుంచి మళ్లీ ఎన్నికయ్యారు. ఈ నలుగురిపై విచారణను రెండు నెలల్లో పూర్తి చేయాలని ప్రధాన న్యాయమూర్తి సుబ్రత్ అరవింద్ ధర్మాధికారి, జస్టిస్ జి. అరుల్ మురుగన్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఏడు రోజుల్లో విచారణకు సంబంధించిన సమయపట్టిక రూపొందించి బహిరంగపరచాలని, ఎమ్మెల్యేలు అనవసర వాయిదాలు కోరితే అనుమతించవద్దని స్పష్టం చేసింది. గరిష్ఠంగా రెండు వాయిదాలకే పరిమితం కావాలని పేర్కొంది. నిర్దిష్ట గడువు తప్పనిసరిగా అమలు కావాలని, ఉల్లంఘన జరిగితే ఆసక్తి ఉన్న వారు కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది.

విప్ ఉల్లంఘనపై మొదలైన వివాదం

2026 మే 13న ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానంపై ఓటింగ్ సమయంలో విప్‌ను ఉల్లంఘించారంటూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి 25 మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేశారు. మే 27న వారిలో 14 మందిపై చర్యను ఉపసంహరించుకుంటున్నట్లు స్పీకర్‌కు లేఖ ఇచ్చారు. ఆ జాబితాలో ఉన్న సి. విజయభాస్కర్, ఎం.ఆర్. విజయభాస్కర్‌లపై విచారణను తిరిగి ప్రారంభించాలని కోరనందున, వారిని సంబంధించిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. మిగిలిన నలుగురి విచారణలో రాజకీయ భేదాలకు అతీతంగా రాజ్యాంగ బాధ్యతను స్పీకర్ నిర్వర్తించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అన్నాడీఎంకే విప్ ఆగి ఎస్.ఎస్. కృష్ణమూర్తి, దేశీయ మక్కల్ శక్తి కచ్చి దాఖలు చేసిన పిటిషన్లపై ఈ తీర్పు వెలువడింది.

దీపావళి తర్వాత కొత్త ఛార్జీలు

- యూపీఐ ఛార్జీలకు పండుగ బ్రేక్!

డిజిటల్ చెల్లింపులు చేసే వ్యాపారులకు ఊరట లభించింది. యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అమలును నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వాయిదా వేసింది. అక్టోబర్ 15 నుంచి అమలు కావాల్సిన ఈ ఛార్జీలను దీపావళి తర్వాత అమలు చేయాలని నిర్ణయించింది. ఖచ్చితమైన తేదీని తర్వాత ప్రకటించనున్నట్లు అక్టోబర్ 13న వెల్లడించింది. పండుగల సమయంలో అమ్మకాలు తగ్గే ప్రమాదం ఉందని వ్యాపార సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రధానమంత్రి కార్యాలయంలో జరిగిన చర్చల అనంతరం వాయిదా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పండుగల వేళ వ్యాపార లావాదేవీలపై అదనపు భారం పడకుండా ఈ చర్య దోహదపడుతుందని వ్యాపార సంఘాలు భావిస్తున్నాయి.

రూ.2,000 దాటితే 0.4 శాతం

ప్రతిపాదిత విధానం ప్రకారం, మధ్యస్థ, పెద్ద వ్యాపార సంస్థల్లో రూ.2,000కు మించిన ఎంపిక చేసిన వ్యక్తి నుంచి వ్యాపారికి జరిగే యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ విధించాల్సి ఉంది. చిన్న వ్యాపారులకు మినహాయింపులు ఉండనున్నట్లు గత ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. మూలధన మార్కెట్, వ్యూహాత్మక రంగాలకు వేర్వేరు రేట్లు వర్తించే అవకాశం ఉంది. ఈ అదనపు ఖర్చు తక్కువ లాభాలతో నడిచే వ్యాపారులపై భారం మోపుతుందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) అభిప్రాయపడింది. సెప్టెంబర్ 30న ఆ సంస్థ ప్రతినిధులు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి ప్రతిపాదిత ఛార్జీల ప్రభావాన్ని వివరించారు. పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లో వ్యాపారాలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు ఈ వాయిదా ఉపశమనమని సీఏఐటీ పేర్కొంది.

వ్యాపారుల అభ్యంతరాలతో వెనక్కి

ఎండీఆర్ అమలును వాయిదా వేయడాన్ని సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ స్వాగతించారు. డిజిటల్ చెల్లింపులకు తమ మద్దతు కొనసాగుతుందని, అయితే వ్యాపారులకు అవి అందుబాటులో ఉండేలా ఖర్చులు నియంత్రించాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాపారుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు, ఎండీఆర్ విధింపుపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఎన్‌పీసీఐ, కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. అక్టోబర్ చివరి నాటికి అఫిడవిట్లు దాఖలు చేయాల్సి ఉంది. ఎల్పీజీ పంపిణీదారులు కూడా తమకు ఎండీఆర్ నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలని పెట్రోలియం శాఖను కోరినట్లు సమాచారం.

నగదు చెల్లింపులపై ఆందోళన

యూపీఐ ఛార్జీలు అమలైతే కొందరు వినియోగదారులు రూ.2,000 పరిమితిని దాటకుండా విడతలవారీగా చెల్లించే అవకాశం ఉందని ఎల్పీజీ పంపిణీదారులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల లావాదేవీల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తడంతో పాటు, డిజిటల్ చెల్లింపుల నుంచి నగదు లావాదేవీల వైపు మళ్లే పరిస్థితి ఏర్పడవచ్చని అభిప్రాయపడ్డారు. పండుగల సమయంలో అమ్మకాలకు ఆటంకం కలగకుండా ఎండీఆర్ అమలును వాయిదా వేయడం తాత్కాలిక ఊరటనిచ్చింది.

భారత్ నిర్ణయంపై చైనా అభ్యంతరం!

- 28 వ్యూహాత్మక ప్రాంతాల పేర్లపై వివాదం
- లడఖ్ తమదేనంటూ డ్రాగన్ వాదన

లడఖ్‌లోని 28 వ్యూహాత్మక ప్రాంతాలు, భౌగోళిక ప్రదేశాలకు భారత్ ప్రామాణిక పేర్లు కేటాయించడంపై చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాంతాలు తమ భూభాగంలో భాగమని పేర్కొంది. అక్టోబర్ 13న బీజింగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ, భారత్ ఏకపక్షంగా ఏర్పాటు చేసిన లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాన్ని తమ దేశం గుర్తించదని తెలిపారు. ఈ ప్రాంతాలకు పేర్లు కేటాయించే భారత నిర్ణయం చట్టవిరుద్ధమని, చెల్లుబాటు కాదని వ్యాఖ్యానించారు. పేర్లు మార్చినంత మాత్రాన పశ్చిమ సరిహద్దు ప్రాంతాలపై తమ వాదన మారదని స్పష్టం చేశారు. మరోవైపు, అక్టోబర్ 2న భారత ప్రభుత్వం ఈ 28 ప్రాంతాలకు అధికారికంగా పేర్లు కేటాయించి, దేశ అధికారిక మ్యాప్‌లో నమోదు చేసింది. లడఖ్ పాలనా యంత్రాంగంతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ చర్య చేపట్టినట్లు కేంద్రం తెలిపింది.

ఎల్ఏసీ వెంబడి కీలక ప్రాంతాలు

భారత్ గుర్తించిన ప్రాంతాల్లో గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ వంటి కీలక సరిహద్దు ప్రాంతాలు ఉన్నాయి. 2020లో భారత్‌చైనా సైనికుల మధ్య ప్రతిష్టంభన సమయంలో ఈ ప్రాంతాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అదే ఏడాది మే 5న పాంగాంగ్ సరస్సు ప్రాంతంలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణతో తూర్పు లడఖ్‌లో ఉద్రిక్తతలు మొదలయ్యాయి. 2022లో సైనిక బలగాల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభమైంది. తాజా జాబితాలో అలీషా గిరి, కుక్సెల్, జోరావర్ శిఖరం, పార్పిక్ హిమానీనదం, శాచ్మిరిక్ కనుమతో పాటు మరికొన్ని పర్వతాలు, లోయలు, నదులు ఉన్నాయి. సరిహద్దు ప్రాంతాల ఖచ్చితమైన గుర్తింపు, అధికారిక మ్యాపుల్లో స్పష్టత, ప్రజల్లో అవగాహన పెంపు ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశాలుగా భారత్ పేర్కొంది. ఈ చర్యపై చైనా అభ్యంతరాలతో ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదం మరోసారి చర్చనీయాంశమైంది.

దీపావళికి కేంద్ర కేబినెట్ విస్తరణ!

- మురుగన్ రాజీనామాతో కదలికలు



కేంద్ర మంత్రివర్గంలో కీలక మార్పులకు రంగం సిద్ధమవుతోందా? దీపావళికి ముందే ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్‌ను విస్తరించనున్నారా? కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ అక్టోబర్ 13న తన మంత్రి పదవికి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా పని చేస్తున్న మురుగన్ తమిళనాడుకు చెందినవారు. అయితే మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన పదవీకాలం 2030 వరకు ఉన్నప్పటికీ, రాష్ట్ర రాజకీయాల్లో పార్టీని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో స్వచ్ఛందంగా వైదొలిగారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీకి ఉన్న బలంతో ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానాన్ని ఆ పార్టీ గెలుచుకునే అవకాశాలున్నాయి. దీంతో కొత్త నేతకు కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పించే అవకాశం ఏర్పడింది.

ఖాళీలతో విస్తరణకు అవకాశం

కేంద్ర మంత్రివర్గంలో ఇప్పటికే పలు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. జార్జ్ కురియన్, రవనీత్ సింగ్ బిట్టూ రాజ్యసభ పదవీకాలం ముగియడంతో గతంలోనే మంత్రి పదవులకు రాజీనామా చేశారు. హర్దీప్ సింగ్ పురి, బి.ఎల్. వర్మల రాజ్యసభ పదవీకాలం కూడా వచ్చే నెలలో ముగియనుంది. మరోవైపు ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవి నుంచి తప్పుకోవడంతో ఆ శాఖ బాధ్యతలను ప్రహ్లాద్ జోషి అదనంగా నిర్వహిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా పంకజ్ చౌధరి, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా హర్ష్ మల్హోత్రా నియామకాల నేపథ్యంలో వారు కూడా మంత్రి పదవులకు రాజీనామా చేయవచ్చనే ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామాలతో కనీసం అరడజను మంత్రి పదవులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. దీపావళికి ముందే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశ ముంది.

2029 ఎన్నికలే మురుగన్ లక్ష్యం

తమిళనాడుకు తిరిగి వెళ్లి పార్టీని బలోపేతం చేయడమే తన రాజీనామా వెనుక ప్రధాన ఉద్దేశమని మురుగన్ స్పష్టం చేశారు. ప్రధాని మోదీకి లేఖ రాసి తనను మంత్రి బాధ్యతల నుంచి తప్పించాలని కోరినట్లు వెల్లడించారు. 2029 లోక్‌సభ ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీని సిద్ధం చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. తమిళ ప్రజల అభిమానం, ప్రధాని పర్యటన సందర్భంగా కనిపించిన ఉత్సాహం తన నిర్ణయానికి ప్రేరణగా నిలిచాయని పేర్కొన్నారు. మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి కేంద్ర కేబినెట్ విస్తరణ ఇదే కానుంది. 71 మంది మంత్రులతో ఏర్పాటైన మంత్రివర్గంలో మార్పులు జరిగితే కొత్త ముఖాలకు అవకాశం దక్కనుంది. మొత్తంగా మురుగన్ రాజీనామా వ్యక్తిగత నిర్ణయమే అయినప్పటికీ, దాని ప్రభావం కేంద్ర రాజకీయాలపై పడే సూచనలు కనిపిస్తున్నాయి.

రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట!

- పరువునష్టం కేసులో విచారణపై స్టే
- 2018 వ్యాఖ్యల కేసులో కీలక ఆదేశాలు

ప్రధాని నరేంద్ర మోదీపై 2018లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కొనసాగుతున్న క్రిమినల్ పరువునష్టం కేసు విచారణకు సుప్రీంకోర్టు తాత్కాలికంగా బ్రేక్ వేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. బాంబే హైకోర్టు సెప్టెంబర్ 8న కేసును కొట్టివేయడానికి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదిస్తూ, ఈ కేసులో విచారణ కొనసాగించడం చట్టపరంగా సమర్థనీయం కాదని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం మహారాష్ట్ర ప్రభుత్వం, ఫిర్యాదుదారు బీజేపీ నేత మహేశ్ శ్రీశ్రీమల్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాల తర్వాత చేపట్టనుంది. అప్పటివరకు ట్రయల్ కోర్టులో తదుపరి విచారణ నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

రఫేల్ ఒప్పందంపై వ్యాఖ్యలే వివాదానికి కారణం

రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై విమర్శలు చేస్తూ రాహుల్ గాంధీ 2018 సెప్టెంబర్‌లో చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మొదలైంది. సెప్టెంబర్ 20న రాజస్థాన్‌లో జరిగిన సభలో ఆయన ఉపయోగించిన 'హిందుస్థాన్ కా చౌకీదార్ చోర్ హై' వ్యాఖ్యతో పాటు, ప్రధాని మోదీని 'కమాండర్ ఇన్ థీఫ్'గా అభివర్ణించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలు ప్రధాని మద్దతుదారుల మనోభావాలను దెబ్బతీశాయని మహేశ్ శ్రీశ్రీమల్ ఫిర్యాదు చేశారు. ఈ వ్యాఖ్యలు మోదీతో పాటు బీజేపీ నేతలు, ఆయనతో సంబంధం ఉన్నవారిపై కూడా దొంగతనం ఆరోపణలు చేసినట్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 500 కింద చర్యలు తీసుకోవాలని కోరారు. 2019లో ముంబై మెజిస్ట్రేట్ కోర్టు ఈ కేసులో విచారణ ప్రారంభించింది.

హైకోర్టు తిరస్కరణపై సుప్రీంకోర్టు పరిశీలన

ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రాహుల్ గాంధీ 2021 నవంబర్‌లో బాంబే హైకోర్టును ఆశ్రయించారు. అయితే, బీజేపీ ఒక గుర్తించదగిన సంస్థ కాదనే వాదనను హైకోర్టు అంగీకరించలేదు. ప్రధాని ఆ పార్టీకి ప్రముఖ ప్రతినిధి కావడంతో ఆయనపై చేసిన వ్యాఖ్యలు పార్టీతో సంబంధం ఉన్న ఇతరులకూ వర్తించే అవకాశాన్ని ప్రాథమిక దశలో తోసిపుచ్చలేమని పేర్కొంది. వ్యాఖ్యలు ప్రధానికి మాత్రమే పరిమితమయ్యాయా, ఇతర బీజేపీ సభ్యులపైనా ప్రభావం చూపాయా అన్నది సాక్ష్యాల ఆధారంగా ట్రయల్ కోర్టు నిర్ణయించాల్సిన అంశమని తెలిపింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ప్రస్తుతం విచారణపై తాత్కాలిక స్టే లభించింది. ఇది కేసు నుంచి పూర్తి విముక్తి కాదు. తదుపరి విచారణలో సుప్రీంకోర్టు తీసుకునే నిర్ణయం ఈ కేసు భవిష్యత్తును నిర్దేశించనుంది.

సర్‌పై రాహుల్ పిటిషన్‌కు లైన్ క్లియర్!

- 24 గంటల్లో సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఆమోదం
- ఓటర్ల తొలగింపుపై విచారణకు డిమాండ్



ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియతో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అధికారాల వినియోగంపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ రాహుల్ గాంధీ నేతృత్వంలోని విపక్ష నేతలు దాఖలు చేసిన పిటిషన్‌కు సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో లైన్ క్లియర్ అయింది. అక్టోబర్ 12న దాఖలైన పిటిషన్‌ను కేవలం 24 గంటల్లోనే పరిశీలించి, అక్టోబర్ 13న నమోదు చేసి నంబరు కేటాయించారు. ఎన్నికల సంఘం నిర్ణయాలు,

పులివెందుల పీఠం హోరాహోరీ

ప్రమీలమ్మతో వైసీపీ తొలి అడుగుబీటెక్ రవి వ్యూహానికి అసలు పరీక్ష!



పులివెందుల మున్సిపల్ పీఠాన్ని దక్కించుకునేందుకు రాజకీయ వేడి మొదలైంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థిగా వైఎస్ ప్రమీలమ్మ పేరును ప్రకటించింది. తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధుసూదన్ రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. చైర్మన్ స్థానం జనరల్ మహిళకు కేటాయించడంతో వైసీపీ మహిళా అభ్యర్థిని రంగంలోకి దించింది. ప్రమీలమ్మకు గతంలోనూ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవం ఉంది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో జరిగిన ఎన్నికల్లో 33 వార్డులకు గాను 32 స్థానాలను వైసీపీ గెలుచుకున్నట్లు స్థానిక రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. అప్పట్లో ప్రమీలమ్మ చైర్మన్ అభ్యర్థిగా నిలిచారు. ఇప్పుడు మరోసారి ఆమె పేరును ప్రకటించడం ద్వారా వైఎస్ కుటుంబానికి ఉన్న రాజకీయ అనుబంధాన్ని ఓట్లుగా మార్చుకోవాలని వైసీపీ భావిస్తోంది. అయితే అప్పటి పరిస్థితులు, ప్రస్తుత రాజకీయ సమీకరణాలు ఒకేలా లేవు. మారిన ప్రజాభిప్రాయం ఈ ఎన్నికల్లో కీలకంగా మారనుంది.

ప్రమీలమ్మకు స్థానిక పరిచయాలు బలం

ప్రమీలమ్మ అభ్యర్థిత్వానికి ఆమె భర్త వైఎస్ మనోహర్ రెడ్డికి ఉన్న స్థానిక పరిచయాలు మరో బలంగా కనిపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండటం, స్థానిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం తమకు కలిసివచ్చే అంశాలని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, వీధి సమస్యలపై అభ్యర్థి స్పందించే తీరు మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయగలదు. కుటుంబ పరిచయాలు మాత్రమే విజయాన్ని ఖాయం చేయవు. వార్డులవారీగా ప్రచారం, కార్యకర్తల సమన్వయం, ప్రజలతో నేరుగా సంబంధాలు కూడా అవసరం. ఇదే సమయంలో ఇటీవల జరిగిన జెడ్పీటీసీ ఉపఎన్నికలో టీడీపీకి అనుకూల ఫలితం రావడం పులివెందుల రాజకీయాల్లో చర్చకు దారితీసింది. బీటెక్ రవి సతీమణి లతారెడ్డి సాధించిన విజయాన్ని టీడీపీ శ్రేణులు సానుకూల సంకేతంగా చూస్తున్నాయి. ఆ ఉత్సాహాన్ని మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగించడం ఆ పార్టీకి కీలకంగా మారింది.

టీడీపీ అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ

వైసీపీ అభ్యర్థిని ప్రకటించడంతో ఇప్పుడు అందరి దృష్టి తెలుగుదేశం పార్టీ నిర్ణయంపై పడింది. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జిగా బీటెక్ రవి కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి కూడా జిల్లాలో రాజకీయ ప్రాధాన్యం ఉంది. ఈ నేపథ్యంలో చైర్మన్ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ప్రముఖ నాయకుల కుటుంబాల నుంచి మహిళా అభ్యర్థిని నిలబెడతారా? లేక స్థానికంగా ప్రజాబలం ఉన్న కొత్త ముఖానికి అవకాశం ఇస్తారా? అనేది తేలాల్సి ఉంది. మహిళా అభ్యర్థిని ఎంపిక చేయడం మాత్రమే కాకుండా, ఆమెకు స్వతంత్రంగా నాయకత్వం వహించే అవకాశం కల్పించడం కూడా ముఖ్యం. వార్డుల సమస్యలపై అవగాహన, ప్రజలతో సంభాషించే సామర్థ్యం, పార్టీ శ్రేణులను కలుపుకొని ముందుకు వెళ్లే నాయకత్వం విజయావకాశాలను ప్రభావితం చేస్తాయి. అభ్యర్థి ఎంపికలో బీటెక్ రవి అనుసరించే వ్యూహం టీడీపీ రాజకీయ బలానికి పరీక్షగా నిలవనుంది.

వారసత్వమా.. వ్యూహమా.. తేల్చేది ఓటరే!

పులివెందుల మున్సిపల్ ఎన్నికలు వైఎస్ కుటుంబ రాజకీయ వారసత్వానికి, టీడీపీ సవాల్‌కు మధ్య ఆసక్తికర పోరుగా మారనున్నాయి. వైసీపీకి తన సంప్రదాయ పట్టును నిరూపించుకోవాల్సిన అవసరం ఉండగా, టీడీపీకి స్థానికంగా తన ప్రభావాన్ని విస్తరించుకునే అవకాశం ఉంది.

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి బలం టీడీపీకి అనుకూలంగా మారుతుందా? వైఎస్ కుటుంబానికి ఉన్న అనుబంధం వైసీపీకి మళ్లీ విజయాన్ని అందిస్తుందా? అన్నది ప్రధాన ప్రశ్న. అయితే జెడ్పీటీసీ ఉపఎన్నిక ఫలితాన్ని మున్సిపల్ ఎన్నికల విజయానికి నేరుగా కొలమానంగా తీసుకోలేం. అభ్యర్థుల ఎంపిక, వార్డులవారీగా ప్రచారం, స్థానిక సమస్యలపై స్పష్టమైన కార్యాచరణ, కార్యకర్తల సమన్వయం ఫలితాన్ని నిర్ణయించగల అంశాలు. వైసీపీ ఇప్పటికే ప్రమీలమ్మ పేరును ప్రకటించి తొలి అడుగు వేసింది. ఇప్పుడు టీడీపీ ఎవరిని బరిలోకి దింపుతుంది? బీటెక్ రవి ఎలాంటి వ్యూహంతో ముందుకు వస్తారో చూడాలి!

స్టార్‌లింక్‌కు పర్మిషన్ వద్దు

దేశ భద్రతకు పొంచి ఉన్న ముప్పు లైసెన్స్ నిరాకరించాల్సిందే స్వదేశీ జాగరణ్ మంచ్ హితవు



ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలకు భారత్‌లో అనుమతి ఇవ్వొద్దని ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ (ఎస్‌జేఎం) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో జాతీయ భద్రతకు సంబంధించిన పలు ఆందోళనలను ప్రస్తావించింది. అల్లర్లు, ఉగ్రవాద ఘటనలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు పుకార్లు, రెచ్చగొట్టే ప్రచారాన్ని అడ్డుకోవడానికి కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేయాల్సి వస్తుందని సంస్థ జాతీయ సహ కన్వీనర్ అశ్వనీ మహాజన్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్టార్‌లింక్ సేవలను నిర్దిష్ట ప్రాంతాల్లో నిలిపివేయడం సాధ్యమేనా? అన్నది ప్రధాన ప్రశ్నగా నిలిచింది. ఈ సాంకేతికతపై స్పష్టమైన హామీలు లభించకపోతే అనుమతులు ఇవ్వకూడదని ఎస్‌జేఎం అభిప్రాయపడింది.

లేజర్ లింకులు, నిఘాపై సందేహాలు

స్టార్‌లింక్ ఉపగ్రహాలు లేజర్ లింకుల ద్వారా భూమిపై ఉన్న కేంద్రాలను దాటవేసి పరస్పరం సమాచారాన్ని పంపుకోగలవని ఎస్‌జేఎం పేర్కొంది. భారతీయ ఇంటర్నెట్ ట్రాఫిక్ దేశంలోని గేట్‌వేల ద్వారానే వెళ్లేలా చూడాలని, విదేశీ మౌలిక సదుపాయాల ద్వారా సమాచార ప్రసారం జరిగితే చట్టబద్ధమైన నిఘాకు ఇబ్బందులు తలెత్తవచ్చని హెచ్చరించింది. శత్రు శక్తులు, స్మగ్లర్లు, తిరుగుబాటు గ్రూపులు సంప్రదాయ టెలికాం నెట్‌వర్క్‌లకు బయట సమాచార మార్పిడికి ఉపగ్రహ ఇంటర్నెట్‌ను ఉపయోగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. సున్నితమైన సరిహద్దు ప్రాంతాల్లో అనధికారిక టెర్మినళ్లు పనిచేస్తున్న ఉదంతాలను కూడా ప్రస్తావించింది. ఉక్రెయిన్, ఇరాన్, రష్యా, చైనా, తైవాన్ దేశాల అనుభవాలను ఉదహరిస్తూ ఉపగ్రహ ఇంటర్నెట్ వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని గుర్తుచేసింది. మరోవైపు, నిరసనల సమయంలో ఇంటర్నెట్ సేవలు యథావిధిగా కొనసాగాలంటూ సుప్రీంకోర్టు ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా ఈ చర్చకు ప్రాధాన్యం పెంచాయి.

స్వదేశీ నెట్‌వర్క్‌లకే ప్రాధాన్యం

భారత్ లో ఇప్పటికే అందుబాటులో ఉన్న మొబైల్, బ్రాడ్ బ్యాండ్ నెట్ వర్క్ లు తక్కువ ఖర్చుతో కనెక్టివిటీ అందిస్తున్నాయని ఎస్ జేఎం పేర్కొంది. అవసరమైనప్పుడు ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటిని నియంత్రించే అవకాశం ఉందని తెలిపింది. భద్రతా సంస్థలతో దేశీయ టెలికాం కంపెనీల సమస్యాన్ని కూడా ప్రస్తావించింది. పీఎస్ ఎల్ వీ, చంద్రయాన్, గగన్ యాన్, నిసార్, చంద్రయాన్ 4 వంటి అంతరిక్ష కార్యక్రమాలను ప్రస్తావిస్తూ స్వదేశీ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలను అభివృద్ధి చేయాలని సూచించింది. మారుమూల ప్రాంతాలకు అందుబాటు ధరల్లో ఇంటర్నెట్ అందించేలా దేశీయ పరిష్కారాలు ఉపయోగపడతాయని అభిప్రాయపడింది. జాతీయ భద్రతా ప్రమాణాలకు స్టార్ లింక్ హామీ ఇవ్వలేకపోతే లైసెన్స్ నిరాకరించాలని కేంద్రాన్ని కోరింది. అమెరికాతో వాణిజ్య సంబంధాల విషయంలోనూ భద్రతా కారణాలతో విదేశీ కంపెనీలపై ఆంక్షలు విధించే హక్కు భారత్ కు ఉందని సంస్థ వాదించింది.



రేవల్లి రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక

రేవల్లి: వనపర్తి జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో రేవల్లి మండల రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా చిట్టి రాజుల శేఖర్, ఉపాధ్యక్షులుగా చిట్టిరాజుల మల్లేష్, కార్యదర్శిగా దుర్గింటి శివ శంకర్ ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధి, సభ్యుల ఐక్యత, సామాజిక సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి, గోపాల్ పేట రజక సంఘాల నాయకులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన నాయకులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ చిట్టి రాజుల శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు. ఏకగ్రీవ ఎన్నికతో రేవల్లి మండల రజక సంఘంలో నూతన ఉత్సాహం నెలకొంది.

ప్రొద్దుటూరులో ఎన్నికలకు అధికారుల సన్నద్ధత



ప్రొద్దుటూరు, అక్టోబర్ 13: స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు ప్రొద్దుటూరు పురపాలక సంఘం అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల అధికారులు (ఈఓలు), అదనపు ఎన్నికల అధికారులు (ఏఈఓలు), సహాయక సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్ ఎన్నికల విధివిధానాలను వివరించారు. పోలింగ్ ప్రక్రియ, ఎన్నికల నియమాలు, విధుల నిర్వహణ, విభాగాల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించారు. సమయపాలన, క్రమశిక్షణతో పాటు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రతి అధికారి నిష్పక్షపాతంగా బాధ్యతలు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. సిబ్బంది సందేహాలను నివృత్తి చేసి, విధుల్లో పొరపాట్లకు తావులేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, మాస్టర్ ట్రైనర్స్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసర మైన సన్నద్ధత పెంపొందించడమే శిక్షణ లక్ష్యమని అధికారులు తెలిపారు.

ప్రొద్దుటూరులో గాంధీ రోడ్డుకు మహర్దశ!



రూ.7 కోట్లతో రహదారి పనులు ప్రారంభంప్రొద్దుటూరు, అక్టోబర్ 13: పట్టణంలో గాంధీ రోడ్డు నుంచి రామేశ్వరం వరకు రూ.7 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేలోపే పనులు ప్రారంభించామని, దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులతో పాటు అవసరమైన చోట్ల కొత్త రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలో సుమారు రూ.100 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ, త్వరలో విచారణ జరగనుందని వెల్లడించారు. రూ.3.25 కోట్లతో కొత్త మార్కెట్ నిర్మించాలన్న తమ ప్రయత్నాన్ని గత పాలకులు అడ్డుకున్నారని విమర్శించారు.

మార్కెట్‌ను రెండు దశల్లో ఆధునీకరించాలన్నది తమ ప్రణాళికగా వివరించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రధాన నినాదమని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, వారి ఆశీర్వాదంతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పక్షపాతం వద్దన్న కమిషనర్



ద్దుటూరు, అక్టోబర్ 13: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది, వార్డు సచివాలయ ఉద్యోగులు రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఏ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ప్రభుత్వ హోదా, కార్యాలయ వనరులను వినియోగించరాదని హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించిన అధికారిక సమాచారం, రికార్డులను నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగించకూడదన్నారు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు గుర్తిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఉద్యోగుల ప్రవర్తనా నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. నిబంధనల ఉల్లంఘన నిర్ధారణైతే సంబంధిత మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు ఉద్యోగుల బాధ్యత కీలకమని కమిషనర్ పేర్కొన్నారు.

వేంపల్లిలో దుర్గమ్మకు భక్తుల నీరాజనం



కడప జిల్లా వేంపల్లి పట్టణంలోని సాయినగర్ శ్రీ దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రతిరోజూ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరిస్తున్నారు. సాయంత్రం వేళల్లో రంగురంగుల పుష్పాలతో చేస్తున్న అలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు. నవరాత్రి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. వేంపల్లి పట్టణ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు ఉదయం, సాయంత్రం ఆలయానికి విచ్చేసి దుర్గమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని, ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. నవరాత్రి వేడుకలతో సాయినగర్ ఆలయం భక్తుల సందడితో కళకళలాడుతోంది.

ఎరువుల డీలర్లకు డీఏఈఎస్ఐ శిక్షణ



మహబూబాబాద్, సెప్టెంబర్ 19 (రాజ్య సంస్కరణ ప్రతినిధి): డీఏఈఎస్ఐ (డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్) శిక్షణ తరగతిని మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌చంద్ర శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఏఈఎస్ఐ కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు. ఎరువుల డీలర్లు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఏఓ తిరుపతిరెడ్డి, డీఈఎస్ఐ కార్యక్రమం ప్రెసిడెంట్ రాంచందర్‌రావు, కేవీకే మల్యాల డాక్టర్ సుహాసిని పాల్గొన్నారు. డీఏఈఎస్ఐ శిక్షణ పొందుతున్న ఎరువుల డీలర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

:18 pm

వక్ష

ట్రామారెడ్డి,
ది దౌర్జన్యం
మయంలో
దని దళిత
ప్ర ప్రవేశం
నని ఆవేదన
ప్యక్తం చేశారు. బాధితుల కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులపై తక్షణమే చట్టపరమైన కింద చర్యలు తీసుకోవాలని సుధీర్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

ఆరోపణలు వచ్చాయి. తరతరాలుగా మాదిగలకు

గంగలో పడవ బోల్తా 13 మంది మృతి




బిహార్‌లోని వైశాలి జిల్లా రాఘోపూర్ ప్రాంతంలో గంగా నదిలో పడవ బోల్తా పడి 13 మంది ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం జరిగిన ఈ దుర్ఘటనలో మృతుల్లో చిన్నారులే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. పడవలో 15 నుంచి 20 మంది వరకు ప్రయాణిస్తున్నట్లు తెలుస్తోంది. వీరంతా ఓ విందుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అధికారులు, జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గల్లంతైన వారి కోసం స్థానికులు కూడా గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. బాధితులకు సహాయం అందించడంతో పాటు, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వ భరోసా

ఈ విషాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల పరిహారం, గాయపడిన వారికి రూ.50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. బిహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల పరిహారం అందిస్తామని వెల్లడించారు.

రెండు తలలతో శిశువు

ఒడిశాలో అరుదైన జననం.. మూడు లక్షల పుట్టుకల్లో ఒకటి .. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స



ఒడిశాలోని కంధమాల్ జిల్లాలో అరుదైన వైద్య పరిస్థితితో శిశువు జన్మించడం చర్చనీయాంశంగా మారింది. అక్టోబర్ 10న సిజేరియన్ ద్వారా జన్మించిన శిశువుకు రెండు తలలు, రెండు మెడలు ఉండగా, శరీరం మాత్రం ఒక్కటే. ఈ అరుదైన పరిస్థితిని వైద్య పరిభాషలో డైసెఫాలిక్ పారాపాగస్ అంటారు. శిశువును వెంటనే బెర్హంపూర్‌లోని ఎంకేసీజీ మెడికల్ కాలేజీ ఆసుపత్రి ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగానికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. శిశువు 32 వారాల గర్భధారణ సమయంలోనే జన్మించినట్లు సమాచారం. పేద కుటుంబానికి వైద్య పరీక్షశిశువు తల్లి కంధమాల్ జిల్లాలోని తుముడిబంద్ ప్రాంతానికి చెందినవారని సమాచారం. రోజువారీ కూలీగా పనిచేసే తండ్రికి ఇది తొలి సంతానం. మెరుగైన వైద్యం కోసం తల్లిని ప్రత్యేక ఆసుపత్రికి తరలించగా, అక్కడ ప్రసవం జరిగింది. శిశువుకు ఒక జత చేతులు, కాళ్లు ఉన్నాయి. బాహ్య జననేంద్రియాలు పురుష శిశువుకు సంబంధించినవిగా ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. అయితే శరీరంలోని అంతర్గత అవయవాల నిర్మాణం, వాటి పనితీరు, ఇతర ఆరోగ్య సమస్యలపై పూర్తి వివరాలు ఇంకా వెల్లడికాలేదు. శిశువు ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడం వైద్య బృందానికి ప్రధాన సవాలుగా మారింది. ప్రతి ప్రాణం విలువైనదే.. వైద్యుల ఆశలుకలసి జన్మించే కవలలు అత్యంత అరుదుగా కనిపిస్తారు. సుమారు మూడు లక్షల జననాల్లో ఒకసారి ఇలాంటి ఘటన చోటుచేసుకుంటుందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఒడిశాలో గతంలో జగా, కాలియా అనే కలసి జన్మించిన కవలల వైద్య ప్రయాణం కూడా దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుత శిశువు విషయంలోనూ అంతర్గత అవయవాల నిర్మాణం, ఆరోగ్య పరిస్థితి, తలల మధ్య సంబంధం వంటి అంశాల ఆధారంగా తదుపరి వైద్య సంరక్షణను నిర్ణయించనున్నారు. రాబోయే రోజుల్లో చికిత్సను నిర్ణయించడంలో కీలకం నిర్వహించే పరీక్షలు శిశువుకు అవసరమైన కానున్నాయి.



రాజకీయాల్లో కొన్నిసార్లు పెద్ద ప్రసంగాలు చేయనవసరం లేదు. సుదీర్ఘ వివరణలు ఇవ్వాల్సిన అవసరమూ ఉండదు. ఒక్క మాట.. ఒక్క సామెత.. ఒక్క చమత్కారం చాలు! చర్చ దారి మారిపోతుంది. విమర్శలకు కొత్త అస్త్రం దొరుకుతుంది. సోషల్ మీడియాకు కావాల్సినంత సరుకు లభిస్తుంది. ఇప్పుడు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చుట్టూ జరుగుతున్న రాజకీయ చర్చ కూడా ఇలాంటిదే. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి చేపట్టిన నిరసనకు ఒవైసీ హాజరుకాలేదు. దీనిపై ప్రశ్నలు ఎదురవడంతో ఆయన చెప్పిన ఒక్క హిందీ సామెత రాజకీయ వర్గాల్లో చర్చకు కేంద్రంగా మారింది. “బేగానీ షాదీ మే మేరా క్యా కామ్?” అంటే.. పరాయివారి పెళ్లిలో నాకేం పని? అని అర్థం. తాను ఇండియా కూటమిలో భాగస్వామిని కానప్పుడు ఆ కూటమి నిరసనకు ఎందుకు వెళ్లాలని ఒవైసీ ప్రశ్నించారు. అంతే.. రాజకీయ ప్రత్యర్థులు ఆయన వ్యాఖ్యను విమర్శలకు ఉపయోగించుకున్నారు. మద్దతుదారులు మాత్రం ఆయన వైఖరిని సమర్థించారు. కాంగ్రెస్ అనుకూల వర్గాలు ప్రతిపక్ష ఐక్యతను ప్రస్తావిస్తే, మజ్లిస్ మద్దతుదారులు కూటమిలో సభ్యత్వం లేని పార్టీని ఎందుకు తప్పబడుతున్నారని ఎదురు ప్రశ్నించారు. సోషల్ మీడియాలో మీమ్స్, వ్యంగ్య పోస్టులు మొదలయ్యాయి. ఒక నిరసనకు హాజరుకాని నాయకుడి గురించి మొదలైన చర్చ కాస్తా ప్రతిపక్షాల ఐక్యత, రాజకీయ పార్టీల మధ్య సంబంధాలు, ఓటర్ల హక్కుల పరిరక్షణ వరకు విస్తరించింది. ఇక్కడ అసలు ప్రశ్న ఒవైసీ ఎక్కడున్నారన్నది మాత్రమే కాదు. ప్రజాస్వామ్యానికి సంబంధించిన అంశంపై ఒకే వేదికపైకి రావడం ముఖ్యమా? లేక ప్రతి పార్టీ తన రాజకీయ అస్తిత్వాన్ని కాపాడుకోవడమే ముఖ్యమా? అన్నదే ఇప్పుడు చర్చనీయాంశం.

బేగానీ షాదీమే.. వేర్ ఈజ్ ఒవైసీ?

పెళ్లి కాంగ్రెస్‌ది.. ప్రశ్నలు అసద్‌వి!

ప్రతిపక్షాల నిరసనకు దూరం

ఒక్క సామెతతో రాజకీయ దుమారం

దేశ రాజకీయాల్లో మజ్లిస్ నయా పంచాయితీ!



“Begani shaadi mein mera kya kaam?” : Owaisi On Why AIMIM Gave INDIA Bloc's EC March A Miss

• ఢిల్లీలో నిరసన.. ఒవైసీ గైర్హాజరు!


అక్టోబర్ 6న ఢిల్లీలో ఇండియా కూటమికి చెందిన ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయం వైపు నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోతున్నాయన్నది ప్రతిపక్షాల ప్రధాన ఆరోపణ. ఎన్నికల సంఘం పనితీరు, దాని స్వతంత్రత, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక విధానం వంటి అంశాలపై కూడా వారు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు నిరసనలో పాల్గొన్నారు. అయితే ఒవైసీ అక్కడ కనిపించలేదు. ఆయన గైర్హాజరుపై ప్రశ్నలు రావడంతో తన రాజకీయ వైఖరిని స్పష్టం చేశారు. తాను ఇండియా కూటమిలో భాగస్వామిని కాదని, అందుకే ఆ నిరసనకు వెళ్లలేదని చెప్పారు. దీనికి తోడు “బేగానీ షాదీ మే మేరా క్యా కామ్?” అంటూ వ్యాఖ్యానించారు. ఈ మాటతో ఆయన తన నిర్ణయాన్ని చమత్కారంగా సమర్థించుకున్నప్పటికీ, రాజకీయంగా కొత్త చర్చకు అవకాశం కల్పించారు. అయితే నిరసనకు దూరంగా ఉన్నంత మాత్రాన ఎన్నికల సంఘంపై ఒవైసీకి అభ్యంతరాలు లేవని భావించడం సరికాదు. ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక విధానంపై ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. ప్రస్తుత ఎంపిక విధానం కార్యనిర్వాహక వ్యవస్థకు అనుకూలంగా ఉందని విమర్శించారు. ప్రధాన న్యాయమూర్తి, ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేతతో కూడిన ఎంపిక వ్యవస్థ ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపైనా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అంటే, ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై ఆయనకు అభిప్రాయాలు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ నేతృత్వంలోని నిరసన వేదికతో కలిసి నడవడానికి ఆసక్తి చూపలేదు. సమస్యపై అభ్యంతరం వ్యక్తం చేయడం ఒకటి.. ఆ సమస్యపై మరొక పార్టీ నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనడం మరొకటి అన్నది ఒవైసీ వైఖరిలో కనిపిస్తున్న ప్రధాన అంశం.

• సామెతలో అర్థం వేరు.. రాజకీయాల్లో అర్థం వేరు!

హిందీలో ప్రాచుర్యంలో ఉన్న “బేగానీ షాదీ మే అబ్దుల్లా దీవానా” అనే సామెతకు పరాయివారి పెళ్లిలో అబ్దుల్లా అతిగా సంబరపడుతున్నాడనే అర్థం ఉంది. తనకు సంబంధం లేని వ్యవహారంలో అనవసరంగా ఉత్సాహం చూపించేవారిని ఎద్దేవా చేయడానికి ఈ మాటను ఉపయోగిస్తారు. అయితే ఒవైసీ చెప్పిన “బేగానీ షాదీ మే మేరా క్యా కామ్?” అనే వాక్యానికి కొంత భిన్నమైన అర్థం ఉంది. తనకు సంబంధం లేని కార్యక్రమంలో తాను ఎందుకు పాల్గొనాలని ఆయన ప్రశ్నించారు. ఈ రెండు వాక్యాల మధ్య తేడా ఉన్నప్పటికీ, రాజకీయ చర్చల్లో వాటిని కలిపి చూస్తున్నారు. కాంగ్రెస్ అనుకూల వర్గాలు ఒవైసీ వ్యాఖ్యను ప్రతిపక్షాల ఐక్యతకు దూరంగా ఉండటానికి చెప్పిన సమాధానంగా విమర్శిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఓటర్ల హక్కులపై ప్రశ్నలు తలెత్తుతున్నప్పుడు రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఉమ్మడి పోరాటంలో పాల్గొనాల్సిన అవసరం ఉందని వాదిస్తున్నాయి. మరోవైపు, మజ్లిస్ మద్దతుదారులు భిన్నమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఇండియా కూటమిలో సభ్యత్వం లేని పార్టీని ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని ఎలా ఆశిస్తారని ప్రశ్నిస్తున్నారు. కూటమి రాజకీయాల్లో భాగస్వామ్యం లేనప్పుడు దాని కార్యక్రమానికి హాజరుకాలేదని తప్పుబట్టడం ఎంతవరకు సమంజసమని నిలదీస్తున్నారు. ఇక్కడ రెండు వాదనల వెనుక రెండు రాజకీయ దృక్పథాలు కనిపిస్తున్నాయి. ఒకటి ప్రజాస్వామ్య సమస్యలపై ప్రతిపక్షాలన్నీ కలిసి పోరాడాలని కోరుతోంది. మరొకటి ప్రతి పార్టీకి తనదైన రాజకీయ గుర్తింపు, నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉండాలని చెబుతోంది. అయితే నిరసనకు ఆహ్వానం అందిందా? గతంలో ఇలాంటి అంశాలపై ఒవైసీతో సంప్రదింపులు జరిగాయా? కూటమి వెలుపల ఉన్న పార్టీలను కలుపుకొని వెళ్లేందుకు కాంగ్రెస్ ఎలాంటి ప్రయత్నాలు చేసింది? వంటి ప్రశ్నలకు స్పష్టత లేకుండా గైర్హాజరును మాత్రమే ఆధారంగా చేసుకుని తుది నిర్ణయానికి రావడం తొందరపాటే. సామెతను ఎవరు ఎలా అర్థం చేసుకున్నారన్నదానికంటే, ఆ వ్యాఖ్య వెనుక ఉన్న రాజకీయ సందర్భాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం.

• కాంగ్రెస్ విమర్శలు.. మజ్లిస్ ఎదురుప్రశ్నలు!

ఈ వివాదంలో కాంగ్రెస్ అనుకూల వర్గాల వాదన ప్రధానంగా ఓటు హక్కుల చుట్టూ తిరుగుతోంది. ఓటు అనేది ఏ ఒక్క పార్టీకి చెందిన ఆస్తి కాదు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఉన్న ప్రాథమిక హక్కు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోతున్నాయన్న ఆరోపణలు వచ్చినప్పుడు వాటిపై ప్రశ్నించడం, తప్పులు ఉంటే సరిదిద్దాలని కోరడం రాజకీయ పార్టీల బాధ్యత అని వారు చెబుతున్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రతపై చర్చ జరుగుతున్నప్పుడు ప్రతిపక్షాలు వేర్వేరు వేదికలపై కాకుండా ఉమ్మడిగా తమ అభిప్రాయాలను వినిపిస్తే ప్రభావం పెరుగుతుందని వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒవైసీ గైర్హాజరును వారు విమర్శిస్తున్నారు. కొందరు ఆయన రాజకీయ వైఖరిపై మరిన్ని ఆరోపణలు చేస్తున్నప్పటికీ, ఒక నిరసనకు హాజరుకాలేదన్న కారణంతోనే ఆయన ఇతర పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని నిర్ధారించలేం. అలాంటి అభిప్రాయాలకు ప్రత్యేక ఆధారాలు అవసరం. మరోవైపు, మజ్లిస్ మద్దతుదారులు తమ పార్టీ స్వతంత్ర రాజకీయ గుర్తింపును ప్రస్తావిస్తున్నారు. ఇండియా కూటమిలో భాగస్వామ్యం లేని పార్టీ నుంచి ప్రతి నిరసనలోనూ పాల్గొనాలని ఆశించడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. రాజకీయ అవసరాలు వచ్చినప్పుడు మాత్రమే ఇతర పార్టీల మద్దతు కోరుతున్నారా? తమ అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నారా? అన్న అంశాలను కూడా చర్చలోకి తీసుకొస్తున్నారు. రాజకీయాల్లో పార్టీలు తమ సిద్ధాంతాలు, ఎన్నికల వ్యూహాలు, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటాయి. అందువల్ల ఒక కూటమిలో చేరకపోవడం మాత్రమే ప్రజాస్వామ్య అంశాలపై వ్యతిరేక వైఖరి తీసుకున్నట్లు కాదు. అదే సమయంలో, కూటమికి వెలుపల ఉన్న పార్టీలు కూడా ఉమ్మడి ప్రజా సమస్యలపై తమ వైఖరిని స్పష్టంగా వెల్లడించవచ్చు. ఒవైసీ ఎన్నికల సంఘం నియామక విధానంపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం ఈ అంశంలో గమనించాల్సిన విషయం. అయితే ఆయన నిరసనకు దూరంగా ఉండటంపై విమర్శలు రావడం కూడా రాజకీయ పరిణామంలో భాగమే. ఐక్యతను కోరేవారికి ఉమ్మడి వేదిక ముఖ్యం; స్వతంత్రతను కోరేవారికి సొంత రాజకీయ నిర్ణయం ముఖ్యం. ఈ రెండింటి మధ్య సమన్వయం ఎలా సాధ్యమన్నదే అసలు చర్చ కావాలి.



• సోషల్ మీడియా కోర్టులో ఒవైసీ.. మీమ్స్‌తో తీర్పులు!

ఒక రాజకీయ నాయకుడి వ్యాఖ్య ప్రజల్లోకి వెళ్లడానికి గతంలో ప్రసంగాలు, పత్రికలు, టెలివిజన్ ప్రధాన మార్గాలుగా ఉండేవి. ఇప్పుడు సోషల్ మీడియా ఆ వేగాన్ని ఎన్నో రెట్లు పెంచుతోంది. ముఖ్యంగా సామెతలు, చమత్కారాలు, వ్యంగ్యంతో కూడిన వ్యాఖ్యలు మీమ్‌లుగా మారడానికి ఎక్కువ సమయం పట్టడం లేదు. ఒవైసీ చెప్పిన మాట కూడా అదే బాటలో సాగుతోంది. కొందరు ఆయన వ్యాఖ్యను సమర్థిస్తూ పోస్టులు పెడుతుంటే, మరికొందరు విమర్శలతో కూడిన మీమ్స్ రూపొందిస్తున్నారు. “వేర్ ఈజ్ ఒవైసీ?” అంటూ ప్రశ్నించే పోస్టులతో పాటు, పరాయివారి పెళ్లిలో అనవసరంగా జోక్యం చేసుకోవద్దనే అర్థం వచ్చే వ్యంగ్యాలు కూడా కనిపిస్తున్నాయి. మరికొందరు మజ్లిస్‌పై గతంలో చేసిన రాజకీయ ఆరోపణలను తిరిగి ప్రస్తావిస్తున్నారు. దీనికి ప్రతిగా మజ్లిస్ అనుకూల వర్గాలు తమ పార్టీని ఆహ్వానించకుండా ఇప్పుడు గైర్హాజరుపై ప్రశ్నించడం ఏమిటని నిలదీస్తున్నాయి. ఇలా ఒక వ్యాఖ్య చుట్టూ అనుకూల, ప్రతికూల ప్రచారం వేగంగా సాగుతోంది. అయితే సోషల్ మీడియాలో ఎక్కువగా ప్రచారంలో ఉన్న ప్రతి పోస్టు వాస్తవానికి అద్దం పడుతుందని అనుకోకూడదు. మీమ్ అనేది వ్యంగ్యాన్ని వ్యక్తం చేసే సాధనం మాత్రమే. అది పూర్తి రాజకీయ విశ్లేషణకు ప్రత్యామ్నాయం కాదు. ఒక వీడియోలోని చిన్న భాగాన్ని మాత్రమే చూపించడం వల్ల అసలు వ్యాఖ్యకు సంబంధించిన సందర్భం మరుగునపడే అవకాశం ఉంది. అలాగే, ఒక నాయకుడి గైర్హాజరును ఆధారంగా చేసుకుని ఆయన మొత్తం రాజకీయ వైఖరిని నిర్ణయించడం కూడా సరైన పద్ధతి కాదు. అదే సమయంలో ప్రజాప్రతినిధులు చేసే వ్యాఖ్యలు ప్రజా చర్చకు రావడం సహజం. వారి నిర్ణయాలను ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంది. నాయకులు కూడా తమ వైఖరిని వివరించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. సోషల్ మీడియాలో లైకులు, షేర్లు, వీక్షణలు పెరగడం ఒక వ్యాఖ్యకు ప్రచారం లభించిందని సూచించవచ్చు. కానీ దాని ఆధారంగా ఆరోపణలు నిజమని తేల్చలేం. మీమ్స్‌లో వ్యంగ్యం ఉండొచ్చు.. రాజకీయ తీర్పు మాత్రం వాస్తవాలు, ఆధారాల ఆధారంగానే ఉండాలి. లేకపోతే అసలు అంశం పక్కకు వెళ్లి, నాయకుల మధ్య మాటల యుద్ధమే ప్రధాన కథగా మిగిలిపోతుంది.

• అసలు చర్చ ఓటు హక్కులపైనా.. రాజకీయ ఆధిపత్యంపైనా?

ఒవైసీ గైర్హాజరు చుట్టూ జరుగుతున్న చర్చలో అత్యంత కీలకమైన అంశం ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేయడం, అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో స్థానం ఉండటం, తప్పులు జరిగితే వాటిని సరిదిద్దేందుకు తగిన అవకాశం కల్పించడం ప్రజాస్వామ్యానికి అవసరం. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన వారి పేర్లు తొలగిపోతున్నాయన్నది ప్రతిపక్షాల ఆరోపణ. ఈ ఆరోపణలను పరిశీలించేటప్పుడు సంబంధిత వివరాలు, అధికారిక వివరణలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాలి. తప్పులు ఉన్నట్లు తేలితే వాటిని సరిదిద్దాలి. అదే సమయంలో ప్రక్రియలోని ప్రతి అంశాన్ని ఆధారాలు లేకుండా తప్పుబట్టడం కూడా సముచితం కాదు. ఎన్నికల కమిషనర్ నియామక విధానంపై ఒవైసీ లేవనెత్తిన అభ్యంతరాలు కూడా స్వతంత్రంగా చర్చించాల్సిన అంశాలే. ఎంపిక ప్రక్రియలో ప్రధాన న్యాయమూర్తికి స్థానం కల్పించాలన్న ఆయన సూచనపై రాజకీయ, రాజ్యాంగపరమైన కోణాల్లో చర్చ జరగవచ్చు. కార్యనిర్వాహక వ్యవస్థ పాత్ర ఎంత ఉండాలి? ప్రతిపక్షానికి ఎలాంటి భాగస్వామ్యం ఉండాలి? ఎన్నికల సంఘం స్వతంత్రతను మరింత బలోపేతం చేసేందుకు ఎలాంటి మార్పులు అవసరం? వంటి ప్రశ్నలు ముఖ్యమైనవి. కానీ ప్రస్తుత చర్చ ఎక్కువగా ఒవైసీ నిరసనకు వచ్చారా? రాలేదా? అన్నదాని చుట్టూ తిరుగుతోంది. ఎవరు ఎవరితో కలిసి నడిచారు? ఎవరు వేదిక పంచుకున్నారు? ఎవరు నినాదాలు చేశారు? అనే లెక్కలకే ప్రాధాన్యం పెరిగితే అసలు సమస్య వెనుకబడిపోయే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో చేపట్టిన నిరసన రాజకీయ ఆధిపత్య పోరుగా మారకూడదు. మరోవైపు, స్వతంత్ర రాజకీయ అస్తిత్వం పేరుతో ప్రజా సమస్యలపై జరిగే చర్చను కూడా పరిమితం చేయకూడదు. ఒవైసీ తన పార్టీ వైఖరిని వెల్లడించవచ్చు. కాంగ్రెస్ ఉమ్మడి పోరాటానికి పిలుపునివ్వవచ్చు. మజ్లిస్ నిర్ణయాన్ని ఇతర పార్టీలు ప్రశ్నించవచ్చు. అయితే వీటన్నింటికంటే ముఖ్యమైనది ప్రజల ఓటు హక్కు. పార్టీల మధ్య విభేదాలు ఉన్నా, ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం నిలబెట్టే బాధ్యత మాత్రం అందరిదీ. చివరకు ఒవైసీ వ్యాఖ్య ఆయనకు ప్రచారం తెచ్చిందా? రాజకీయంగా ఇబ్బంది కలిగించిందా? అన్నది కాలమే నిర్ణయిస్తుంది. కాంగ్రెస్‌కు ప్రతిపక్ష ఐక్యతను ప్రస్తావించే అవకాశం లభించింది. మజ్లిస్‌కు తన స్వతంత్ర వైఖరిని వివరించే సందర్భం వచ్చింది. సోషల్ మీడియాకు కొత్త చర్చ దొరికింది. కానీ ఈ పరిణామాల మధ్య ఓటర్ల జాబితా సవరణపై వచ్చిన అభ్యంతరాలకు సమాధానాలు లభించాయా? ఎన్నికల సంఘం స్వతంత్రతపై లేవనెత్తిన ప్రశ్నలకు స్పష్టత వచ్చిందా? అన్నదే ప్రజలు తెలుసుకోవాల్సిన విషయం. పెళ్లికి ఎవరు వచ్చారు? ఎవరు రాలేదు? అన్నది రాజకీయ లెక్క కావచ్చు. ప్రజాస్వామ్యానికి సంబంధించిన పెళ్లిలో అసలు హక్కుదారులు ప్రజలే. వారి ఓటుకు భద్రత కల్పించడం, వారి హక్కులను కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత. సామెతల సందడి ముగిసిన తర్వాత కూడా మిగలాల్సిన ప్రశ్న ఇదే.



తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఆసక్తికరమైన పరిణామాలు కనిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్‌ను గద్దె దించి వచ్చే ఎన్నికల్లో పాగా వేయాలని బీజేపీ భావిస్తుంటే, తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. మరోవైపు, ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరగకుండా చూసుకుంటూ, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతూ కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. మూడు పార్టీల మధ్య పోటీ రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతోంది. కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయమని బీజేపీ ప్రకటిస్తుంటే, వచ్చే ఎన్నికల్లో ప్రజలు తమకే పట్టం కడతారని బీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ రెండు పార్టీల సవాళ్లను ఎదుర్కొంటూ అధికారాన్ని కాపాడుకోవడం కాంగ్రెస్‌కు కీలకంగా మారింది. అయితే, ఈ రాజకీయ పోరులో ప్రజలకు సంబంధించిన సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, పెరుగుతున్న ధరలు, పన్నుల భారం వంటి అంశాలు కూడా ప్రధాన పాత్ర పోషించనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే, ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం ఉందనే విషయంపై ఇప్పుడే ఒక నిర్ణయానికి రావడం కష్టం. ఎవరికి వారు తమ వాదనలతో ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. అధికారమే అంతిమ లక్ష్యంగా సాగుతున్న ఈ పోరులో ఒక్కో పార్టీ వేస్తున్న అడుగు మరో పార్టీ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశముంది. ముఖ్యంగా ఎస్ఐఆర్ వివాదం రాజకీయ చర్చకు కేంద్రంగా మారడంతో మూడు పార్టీల వ్యూహాలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ వివాదం ఎవరికి రాజకీయంగా లాభం చేకూరుస్తుంది? ఎవరి వాదనలకు ప్రజల నుంచి మద్దతు లభిస్తుంది? అనే ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

- ఒకరికి అందని ద్రాక్ష.. ఒకరికి కేక్ వాక్
- సీఈసీపై పోరులో ఎవరిది పైచేయి
- రాజకీయ చదరంగంలో మునిగేదెవరు?



అల్లంత దూరంలో.. అధికారం

సర్‌మంటున్న తెలంగాణ రాజకీయం



ఎస్ఐఆర్ వివాదం.. బీజేపీకి రాజకీయ సవాల్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశం తెలంగాణ రాజకీయాల్లో కొత్త వివాదానికి తెరదీసింది. ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చేందుకు ఓటర్ల జాబితాను సమీక్షించడం అవసరమని బీజేపీ వాదిస్తుండగా, ఈ ప్రక్రియ వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయనే ఆరోపణలు కాంగ్రెస్ నుంచి వినిపిస్తున్నాయి. ఓట్ల తొలగింపు, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోవడం, ఓటు హక్కుకు సంబంధించిన సందేహాలు వంటి అంశాలు ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణలో పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగించి రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో సుమారు 75 లక్షల ఓట్లను తొలగించి అధికారంలోకి రావాలని బీజేపీ చూస్తోందంటూ అధికార పార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలను నిర్ధారించే అధికారిక ఆధారాలు, ఎన్నికల సంఘం వెల్లడించే వివరాలు కీలకంగా మారనున్నాయి. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగకూడదనేది ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైన అంశం. అదే సమయంలో, చనిపోయినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, నిబంధనల ప్రకారం తొలగించాల్సిన పేర్ల విషయంలో చట్టబద్ధమైన విధానాలు పాటించాల్సి ఉంటుంది. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యతను పాటించడం ఎన్నికల సంఘానికి సవాల్‌గా నిలుస్తోంది. బీజేపీ తన చర్యలను సమర్థించుకుంటున్న నేపథ్యంలో, కాంగ్రెస్ ఆరోపణలు రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపుతాయనే అంశంపై ఆసక్తి నెలకొంది. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందితేనే అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది. లేకపోతే, ఓటర్ల జాబితా అంశం ఎన్నికల సమీపించే కొద్దీ మరింత రాజకీయ వేడిని పెంచవచ్చు. ఈ వివాదం బీజేపీకి అనుకూలంగా మారుతుందా, లేక ఆ పార్టీపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు బలం చేకూరుస్తుందా అన్నది రానున్న పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

• బీఆర్ఎస్ విమర్శలు.. కాంగ్రెస్ వ్యూహం

ఎస్ఐఆర్ అంశంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతుండగా, బీఆర్ఎస్ కూడా ఈ వివాదంలో తనదైన వాదనను వినిపిస్తోంది. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణ వంటి అంశాలను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల వ్యవస్థపై విమర్శలు చేస్తోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహారశైలిని ప్రశ్నిస్తూ, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు ఉండాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. అయితే, కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, వాటి రాజకీయ లక్ష్యాలు, విమర్శల దిశ ఒకేలా లేవు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న పార్టీగా తన ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న బీజేపీని ఎదుర్కోవడంతోపాటు, ఓటర్ల జాబితా అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. బీఆర్ఎస్ మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేస్తూనే, కేంద్రంలోని బీజేపీ వైఖరిని కూడా ప్రశ్నిస్తోంది. దీంతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు సంక్లిష్టంగా మారుతున్నాయి. ఒకే అంశంపై మూడు పార్టీలు వేర్వేరు రాజకీయ సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. బీజేపీ ఎన్నికల వ్యవస్థలో సంస్కరణల అవసరాన్ని ప్రస్తావిస్తుంటే, కాంగ్రెస్ ఓట్ల తొలగింపు ఆరోపణలతో దాడి చేస్తోంది. బీఆర్ఎస్ మాత్రం కేంద్రం, ఎన్నికల సంఘం వ్యవహారాలపై ప్రశ్నలు లేవనెత్తుతూ తన రాజకీయ ప్రాధాన్యాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రజలు ఏ పార్టీ వాదనను విశ్వసిస్తారనేది కీలకంగా మారింది. విమర్శలు చేయడం ఒక ఎత్తయితే, వాటికి ఆధారాలు చూపించడం మరో ఎత్తు. అందువల్ల ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య వాస్తవాలు ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలతోపాటు ఎన్నికల వ్యవస్థపై కూడా ఉంది. ఎస్ఐఆర్ చర్చలో ఎవరు ప్రజల సందేహాలకు సమాధానాలు ఇస్తారో, ఎవరు కేవలం రాజకీయ ఆరోపణలకే పరిమితమవుతారో అన్నది వారి విశ్వసనీయతను ప్రభావితం చేయనుంది.

• ఎన్నికల పారదర్శకత.. పార్టీల వాదనల పరీక్ష


ఎన్నికలు పారదర్శకంగా జరగడం లేదనే విమర్శలపై బీజేపీ వర్గాలు భిన్నమైన వాదనను వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగి ఉంటే కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధ్వర్యంలోని ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయని ప్రశ్నిస్తున్నాయి. తమకు అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ఎన్నికలను విశ్వసించి, ప్రతికూల ఫలితాలు వచ్చినప్పుడు ఎన్నికల వ్యవస్థను తప్పుబట్టడం సరికాదన్నది ఈ వాదనలోని ప్రధాన అంశం. మరోవైపు, ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు జరిగినా వాటిని సరిదిద్దాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ కోరుతున్నాయి. ఇక్కడ అసలు ప్రశ్న ఎన్నికల ఫలితాల గురించి మాత్రమే కాదు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు ఉండాలి, ప్రతి ఓటు నిబంధనల ప్రకారం లెక్కించబడాలి, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం ఉండాలి. ఈ మూడు అంశాలు ప్రజాస్వామ్యానికి పునాదులు. ఒక రాష్ట్రంలో ఒక పార్టీ గెలిచిందనే కారణంతో దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేవని నిర్ధారించలేం. అదే విధంగా, ఆరోపణలు వచ్చినంత మాత్రాన ఎన్నికల అక్రమాలు జరిగాయని కూడా తేల్చలేం. ప్రతి ఆరోపణకు ఆధారాలు, సంబంధిత అధికారుల వివరణ, అవసరమైన చోట చట్టపరమైన పరిశీలన ఉండాలి. తెలంగాణలో ఎస్ఐఆర్ చుట్టూ జరుగుతున్న రాజకీయ పోరు ఈ అంశాలను మరింత ముందుకు తెస్తోంది. బీజేపీ తన వాదనకు ప్రజల మద్దతు సంపాదించాలంటే ప్రక్రియలో పారదర్శకతను వివరించాల్సి ఉంటుంది. కాంగ్రెస్ తన ఆరోపణలకు ఆధారాలు చూపించాలి. బీఆర్ఎస్ కూడా విమర్శలతోపాటు ప్రత్యామ్నాయ సూచనలు చేయాల్సి ఉంటుంది. ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడమే ఈ పోటీలో పార్టీలకు అసలైన పరీక్ష. ఆరోపణల రాజకీయాలు కొంతకాలం ప్రజల దృష్టిని ఆకర్షించవచ్చు. కానీ ఎన్నికల సమయంలో ఓటర్లు తమ సమస్యలకు ఎవరు పరిష్కారాలు చూపించారు, ఎవరు బాధ్యతాయుతంగా వ్యవహరించారు అనే అంశాలను కూడా పరిశీలించే అవకాశం ఉంది. అందుకే ఎస్ఐఆర్ వివాదం కేవలం పార్టీల మధ్య పోరుగా కాకుండా, ఓటర్ల హక్కులు, ఎన్నికల విశ్వసనీయతకు సంబంధించిన అంశంగా మారుతోంది.

• ధరల భారం.. రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తాయా?

రాజకీయ పార్టీల మధ్య ఎస్ఐఆర్ వివాదం వేడెక్కుతున్న సమయంలో ప్రజలను నేరుగా ప్రభావితం చేస్తున్న సమస్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పన్నుల భారం, కుటుంబాల ఖర్చులు, ఉపాధి అవకాశాలు వంటి అంశాలు సామాన్య ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ తెలంగాణ ప్రజలకు ఏం హామీ ఇవ్వబోతోంది? అధికారంలోకి వస్తే ఏ సమస్యలకు ప్రాధాన్యం ఇస్తుంది? అనే ప్రశ్నలకు సమాధానాలు అవసరం. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తన పథకాల అమలు విషయంలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించాల్సి ఉంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేసింది? అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు అందుతున్నాయా? ప్రభుత్వ నిర్ణయాల వల్ల ప్రజలకు కలిగిన ప్రయోజనం ఏమిటి? వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు, ప్రభుత్వ పనితీరే అధికార పార్టీకి ప్రధాన బలంగా మారతాయి. అదే సమయంలో, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలను లేవనెత్తడం మాత్రమే కాకుండా వాటికి ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను సూచించాలి. బీజేపీ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగాలంటే తన రాజకీయ విమర్శలను మించి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను వివరించాలి. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావాలని భావిస్తే గత పాలన అనుభవాన్ని ప్రస్తావించడంతోపాటు, భవిష్యత్తులో ఏ విధమైన పాలన అందిస్తుందో స్పష్టం చేయాలి. కాంగ్రెస్ మాత్రం అధికారంలో ఉన్న పార్టీగా తన పనితీరును ప్రజల ముందుంచాల్సి ఉంటుంది. ఎస్ఐఆర్ అంశం ప్రస్తుతం రాజకీయ చర్చలో ముందున్నప్పటికీ, ధరల పెరుగుదల, పన్నుల భారం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను పూర్తిగా పక్కన పెట్టడం ఏ పార్టీకీ సాధ్యం కాదు. రాజకీయ నినాదాల కంటే ప్రజల జీవితాల్లో కనిపించే మార్పులకే ఎక్కువ విలువ ఉండే అవకాశం ఉంది. అందువల్ల మూడు పార్టీలు తమ ప్రచార వ్యూహాలను రూపొందించేటప్పుడు ప్రజల దైనందిన సమస్యలను ప్రధానంగా పరిగణించాల్సి ఉంటుంది. అధికార పార్టీకి పథకాల అమలు పరీక్షగా మారితే, ప్రతిపక్షాలకు విశ్వసనీయమైన ప్రత్యామ్నాయాన్ని చూపించడం సవాల్‌గా నిలుస్తుంది.

• ఖైరతాబాద్ ఉపఎన్నిక.. గ్రేటర్ పోరుపై ఉత్కంఠ






తెలంగాణ రాజకీయాల్లో ఎస్ఐఆర్ వివాదంతోపాటు ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల నిర్వహణ అంశాలు కూడా ఆసక్తిని పెంచుతున్నాయి. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఎప్పుడు జరుగుతుంది? ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? న్యాయస్థానాల పరిణామాలు రాజకీయ సమీకరణాలను ఎలా ప్రభావితం చేస్తాయి? అనే ప్రశ్నలకు ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. కాంగ్రెస్ నేత పి. విజయారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌తోపాటు సంబంధిత న్యాయపరమైన అంశాలపై వచ్చే పరిణామాలు ఈ వ్యవహారంలో కీలకంగా మారవచ్చు. హైకోర్టు, సుప్రీంకోర్టు పరిధిలోని అంశాలపై వెలువడే నిర్ణయాలను బట్టి తదుపరి చర్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే, న్యాయస్థానాల తీర్పులు వెలువడే వరకు ఉపఎన్నికకు సంబంధించి తుది అంచనాలకు రావడం తొందరపాటే అవుతుంది. మరోవైపు, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల నిర్వహణపై కూడా ఉత్కంఠ కొనసాగుతోంది. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు ప్రకటిస్తారు? స్థానిక రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయి? నగర ఓటర్ల సమస్యలు ప్రచారంలో ఎంత ప్రాధాన్యం పొందుతాయి? అనే అంశాలపై రాజకీయ వర్గాలు దృష్టి సారిస్తున్నాయి. ఈ ఎన్నికలు మూడు ప్రధాన పార్టీలకు తమ బలాన్ని పరీక్షించుకునే అవకాశాన్ని కల్పించవచ్చు. ఖైరతాబాద్ ఉపఎన్నిక, గ్రేటర్ ఎన్నికలు, ఎస్ఐఆర్ వివాదం.. ఈ మూడు అంశాలు తెలంగాణ రాజకీయాల్లో వేర్వేరు ప్రభావాలను చూపే అవకాశం ఉంది. బీజేపీ తన విస్తరణ లక్ష్యానికి అనుగుణంగా అడుగులు వేస్తుంటే, బీఆర్ఎస్ తిరిగి రాజకీయంగా బలపడేందుకు ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ మాత్రం ప్రభుత్వ పనితీరును సమర్థించుకుంటూ ప్రతిపక్షాల దాడులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ పోరులో చిన్న వ్యూహాత్మక పొరపాటు కూడా పెద్ద రాజకీయ నష్టానికి దారితీయవచ్చు. ఒక పార్టీ చేసిన విమర్శకు సమాధానం ఇవ్వడంలో విఫలమైనా, ప్రజా సమస్యను నిర్లక్ష్యం చేసినా, ఎన్నికల అంచనాలను తప్పుగా వేసినా దాని ప్రభావం భవిష్యత్తు రాజకీయాలపై పడవచ్చు. అందుకే తెలంగాణలో ఇప్పుడు ప్రతి అడుగు కీలకం.. ప్రతి ప్రకటనకు రాజకీయ ప్రాధాన్యం ఉంది. చివరకు ఎవరు పైచేయి సాధిస్తారన్నది నినాదాలతో కాకుండా ప్రజల విశ్వాసం, పార్టీలు చూపించే పనితీరు, ఎన్నికల పరిణామాలు నిర్ణయించనున్నాయి. అధికార కాంగ్రెస్ తన స్థానాన్ని నిలబెట్టుకుంటుందా? బీజేపీ బలమైన ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందా? బీఆర్ఎస్ తిరిగి అధికార పోటీలో ముందుకొస్తుందా? అనే ప్రశ్నలకు రానున్న రాజకీయ పరిణామాలే సమాధానం చెప్పనున్నాయి.

తెలుగు నాట రాక్రే పాట

అంతు చిక్కని రాజకీయ ఆట

- విసా రెడ్డి వింత అజెండా
- జెన్ జీకి సైతం అర్థం కాని జెండా..!





రాజకీయాల్లో పేరు సంపాదించడం ఒక ఎత్తు.. ప్రజల నమ్మకాన్ని గెలవడం మరో ఎత్తు! వైఎస్సార్ వారసుడిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లో గుర్తింపు తెచ్చుకోవడానికి, సినిమా ఇమేజ్, మెగా కుటుంబ నేపథ్యం ఉన్న పవన్ కళ్యాణ్ రాజకీయంగా నిలదొక్కుకోవడానికి సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి వచ్చింది. అలాంటిది విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తే ప్రజలు ఎందుకు ఆదరించాలి? బాల్ ఠాక్రే తరహా రాజకీయాలు చేస్తాననే ఆలోచనతోనే ప్రజలను ఆకట్టుకోగలరా? మహారాష్ట్రలో శివసేనను స్థాపించిన బాల్ ఠాక్రే హిందుత్వ భావజాలం, దూకుడైన రాజకీయ శైలి, కార్యకర్తలపై ప్రభావంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణను వ్యతిరేకిస్తూ మైదానాన్ని తవ్వించిన ఘటన ఆయన రాజకీయ శైలికి ఉదాహరణగా నిలిచింది. అయితే, అప్పటి రాజకీయ పరిస్థితులు వేరు.. ఇప్పటి పరిస్థితులు వేరు. ఆయన పేరును ప్రస్తావించడం కంటే, అలాంటి ప్రభావాన్ని సాధించడానికి అవసరమైన సిద్ధాంతం, ప్రజాబలం, సంస్థాగత నిర్మాణం విజయసాయిరెడ్డి చూపించగలరా అన్నదే అసలు ప్రశ్న. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ, చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ, పవన్ కళ్యాణ్ జనసేనతో కూడిన కూటమి రాజకీయాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త పార్టీ ప్రజలకు ఏ ప్రత్యామ్నాయం చూపించబోతోంది? రెడ్డి సామాజికవర్గం మద్దతుతో ముందుకు సాగుతారా? లేక బీసీ, ఎస్సీ, కాపు సహా అన్ని వర్గాలను కలుపుకుంటారా? సాయిరెడ్డి నినాదం వెనుక లక్ష్యమేమిటి? ఎస్ఐఆర్, ఎన్నికల వ్యవస్థ, ప్రభుత్వ విధానాలపై ఆయన వైఖరి ఏమిటి? ఆడిటర్‌గా లెక్కలు చూసిన విజయసాయిరెడ్డి రాజకీయ సమీకరణాలను ఎలా అంచనా వేస్తారు? పేరు, నినాదం మాత్రమే రాజకీయ బలాన్ని సృష్టించవు.. స్పష్టమైన సిద్ధాంతం, ప్రజల విశ్వాసం, ఆచరణ సాధ్యమైన అజెండానే కొత్త రాజకీయ ప్రయాణానికి పునాది. ఇవి లేకుండా పార్టీ స్థాపిస్తే, ప్రజల మద్దతు సాధించడం ఆయనకు పెద్ద సవాలుగా మారవచ్చు.


జగన్, పవన్‌ల ప్రయాణమే ఒక గుణపాఠం!

ఇమేజ్ ఉన్నా.. సామాజిక బలం ఉన్నా.. ప్రజల తీర్పే కీలకం! ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పటికే బలమైన నాయకత్వాలు ఉన్నాయి. వైఎస్సార్ వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి పేరుతో పాటు సొంత రాజకీయ పోరాటం, ప్రజల్లో ఏర్పరచుకున్న గుర్తింపుతో ఎదిగారు. వైఎస్సార్ పేరు చెప్పుకొని రాజకీయంగా నిలదొక్కుకోవడానికి ఆయనకూ సుదీర్ఘ ప్రయాణమే అవసరమైంది. రెడ్డి సామాజికవర్గం నుంచి మద్దతు ఉన్నప్పటికీ, కేవలం ఆ బలంతోనే రాజకీయ విజయం సాధ్యం కాలేదు. ప్రజల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవాల్సి వచ్చింది. మరోవైపు పవన్ కళ్యాణ్‌కు సినిమా ఇమేజ్, మెగా కుటుంబ నేపథ్యం, కాపు సామాజికవర్గంలో గణనీయమైన మద్దతు ఉన్నాయి. అయినప్పటికీ జనసేనను స్థాపించి తొలి ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినప్పుడు ఆయన రెండు నియోజకవర్గాల్లోనూ ఓటమి ఎదుర్కొన్నారు. ఆ తర్వాత పార్టీని బలోపేతం చేస్తూ, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ముందుకు సాగి డిప్యూటీ సీఎం స్థాయికి చేరుకున్నారు. ఈ రెండు ఉదాహరణలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పేరు, ఇమేజ్, సామాజికవర్గం అండ రాజకీయాల్లో ప్రారంభ బలం మాత్రమే.. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి స్పష్టమైన కార్యాచరణ అవసరం. జగన్, పవన్ కళ్యాణ్‌లకు సైతం రాజకీయంగా ఎదగడానికి సుదీర్ఘ ప్రయాణం అవసరమైనప్పుడు, విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ వేదికను నిర్మించాలంటే తన ప్రత్యేకతను నిరూపించుకోవాలి. ఆయనకు ఎవరు ఓటేస్తారు? ఏ అంశాలు ప్రజలను ఆకర్షిస్తాయి? ఏ నాయకత్వ లక్షణాలు ఓటర్లలో నమ్మకం కలిగిస్తాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఆయన రాజకీయ భవిష్యత్తుకు పునాదిగా నిలవనున్నాయి.

సామాజిక సమీకరణాలే అసలు పరీక్ష!

ఏ వర్గం అండతో రాజకీయ ప్రయాణం సాగిస్తారు? ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక సమీకరణాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ప్రధాన పార్టీలకు వివిధ సామాజికవర్గాల్లో బలమైన మద్దతు కనిపిస్తుంది. టీడీపీకి కమ్మ సామాజికవర్గంలో, వైఎస్సార్‌సీపీకి రెడ్డి సామాజికవర్గంతో పాటు ఎస్సీ వర్గాల్లో, జనసేనకు కాపు సామాజికవర్గంలో గణనీయమైన మద్దతు ఉందనే రాజకీయ అంచనాలు ఉన్నాయి. అయితే, ఈ పార్టీల మద్దతు కేవలం కుల (సర్) సమీకరణాలకే పరిమితం కాదు. నాయకత్వం, రాజకీయ విధానాలు, స్థానిక పరిస్థితులు, అభ్యర్థుల ఎంపిక, ప్రభుత్వ పనితీరు కూడా ఓటర్ల నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. ఈ నేపథ్యంలో విజయసాయిరెడ్డి కొత్త పార్టీ ఏర్పాటు చేస్తే, ఆయన వెంట నిలిచే సామాజికవర్గం ఏది? రెడ్డి సామాజికవర్గాన్ని ప్రధాన ఆధారంగా చేసుకుంటారా? బీసీ వర్గాలకు నాయకత్వంలో ప్రాధాన్యం ఇస్తారా? ఎస్సీ వర్గాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచుతారా? కాపు సామాజికవర్గాన్ని ఆకర్షించే ప్రయత్నం చేస్తారా? లేక అన్ని వర్గాలను కలుపుకొని కొత్త రాజకీయ శక్తిగా ఎదగాలనుకుంటారా? ఈ ప్రశ్నలకు ఆయన స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. బాల్ ఠాక్రే తరహా రాజకీయాలు చేస్తానంటే, తన పార్టీ నాయకత్వ నిర్మాణం ఎలా ఉంటుందో కూడా వివరించాలి. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరిని ముందుకు తెస్తారు? పార్టీ నిర్ణయాల్లో సామాజిక సమతుల్యతకు ఎంత ప్రాధాన్యం ఇస్తారు? ఒక సామాజికవర్గం పేరు చెప్పడం కంటే, అన్ని వర్గాల ప్రజలకు విశ్వసనీయమైన వేదికగా ఎదగడం పెద్ద సవాలు. సామాజిక సమీకరణాలను మాత్రమే నమ్ముకొని ముందుకు సాగితే పార్టీ పరిధి పరిమితమయ్యే ప్రమాదం ఉంది. ప్రజా సమస్యలను కేంద్రంగా చేసుకొని అన్ని వర్గాలను కలుపుకుంటేనే విస్తృత రాజకీయ మద్దతు సాధించే అవకాశం ఉంటుంది.

సాయిరెడ్డి నినాదం వెనుక అసలు అజెండా ఏమిటి?




నినాదం వినిపిస్తోంది.. విధానం మాత్రం స్పష్టం కావాలి! విజయసాయిరెడ్డి రాజకీయ ప్రయాణంలో మరో కీలక అంశం ఆయన గత రాజకీయ అనుబంధాలు, ప్రస్తుత వైఖరి. వైఎస్సార్‌సీపీకి విధేయుడనే ముద్ర నుంచి బయటపడేందుకు ఆయన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం రాజకీయ చర్చకు దారితీసింది. అనంతరం ఆయన తదుపరి రాజకీయ దిశపై భిన్నమైన అంచనాలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు సాయిరెడ్డి నినాదంతో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించాలనుకుంటే, ఆ ప్రయాణం ఎటువైపు సాగుతుందో స్పష్టం చేయాలి. ముఖ్యంగా ఎన్నికల వ్యవస్థ, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పంటి అంశాలపై ఆయన వైఖరి ఏమిటి? సర్ పై విమర్శలకు మద్దతు ఇస్తారా? ఎన్నికల సంఘం నిర్ణయాలపై తన అభిప్రాయాలను వెల్లడిస్తారా? ప్రభుత్వ విధానాలను సమర్థిస్తారా? విమర్శిస్తారా? ప్రజాస్వామ్య వ్యవస్థలో తన పార్టీ పాత్ర ఏమిటో వివరిస్తారా? యువతకు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ 'జెన్ జీ' గురించి మాట్లాడుతున్నప్పుడు, యువత ముందుకు తీసుకొస్తున్న డిమాండ్లపై కూడా స్పష్టమైన వైఖరి అవసరం. ఎన్నికల వ్యవస్థపై ఆందోళనలు, ప్రభుత్వ విధానాలపై విమర్శలు, యువత ఆకాంక్షలు వంటి అంశాలపై ఒకే విధమైన ప్రమాణాలతో స్పందించాలి. గతంలో అధికారంలో ఉన్నప్పుడు అనుసరించిన విధానాలు, ఇప్పుడు చెబుతున్న సిద్ధాంతాల మధ్య సంబంధాన్ని కూడా వివరించాలి. రాజకీయ విశ్వసనీయత అనేది నినాదాలతో రాదు.. మాటలకు, చేతలకు మధ్య ఉన్న సంబంధంతో ఏర్పడుతుంది. గత ఐదేళ్ల పాలనపై తన అభిప్రాయాలను, ప్రజలకు అందిన ప్రయోజనాలను, ఎదురైన సమస్యలను విశ్లేషించి చెప్పగలిగితేనే ఆయన వైఖరిపై స్పష్టత ఏర్పడుతుంది. కొత్త పార్టీ ప్రకటనతోనే ప్రయాణం పూర్తికాదు. ప్రజల్లోకి వెళ్లే కార్యాచరణ, క్షేత్రస్థాయి బృందం, దీర్ఘకాలిక ప్రణాళిక కూడా అవసరం.

ప్రజలు విజయసాయిరెడ్డి వైపు ఎందుకు రావాలి?

విమర్శలు చేయడం వేరు.. ప్రత్యామ్నాయం చూపించడం వేరు! ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ ఒకవైపు ఉండగా, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి మరోవైపు ఉంది. ఈ రాజకీయ పరిస్థితుల్లో విజయసాయిరెడ్డి కొత్త పార్టీ స్థాపించాలని భావిస్తే, ఇప్పటికే ఉన్న పార్టీలకు భిన్నంగా ప్రజలకు ఏం అందించబోతున్నారో చెప్పాలి. జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం వల్ల కూటమి నాయకుల నుంచి ప్రశంసలు లభించవచ్చు. కానీ ఆ ప్రశంసలు ఓట్లుగా మారతాయనే హామీ లేదు. రాజకీయాల్లో ప్రత్యర్థులపై విమర్శలు చేయడం సహజమే. అయితే, కొత్త పార్టీని నిర్మించాలనుకునే నాయకుడికి ప్రజల సమస్యలపై స్పష్టమైన అవగాహన, పరిష్కారాలపై కార్యాచరణ అవసరం. వ్యవసాయం, ఉపాధి, విద్య, వైద్యం, పరిశ్రమలు, పెట్టుబడులు, సామాజిక న్యాయం వంటి అంశాల్లో తన విధానాలను ప్రకటించాలి. యువతకు ఎలాంటి అవకాశాలు కల్పిస్తారు? రైతులకు ఏం చేస్తారు? నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి ఎలాంటి ప్రణాళికలు రూపొందిస్తారు? ప్రభుత్వ పథకాల అమలుపై తన అభిప్రాయాలు ఏమిటి? పాలనలో ఎలాంటి మార్పులు తీసుకురావాలనుకుంటున్నారు? ఇవన్నీ ప్రజలకు వివరించాలి. కేవలం కొత్త పేరు, కొత్త నినాదం, కొత్త వేదికతో రాజకీయాల్లో ప్రత్యేకత సాధించడం కష్టం. జగన్ కాదు.. చంద్రబాబు కాదు.. పవన్ కళ్యాణ్ కాదు.. విజయసాయిరెడ్డినే ఎందుకు ఎంచుకోవాలి? ఈ ప్రశ్నకు ఓటర్లకు నమ్మకం కలిగించే సమాధానం ఇవ్వాలి. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే విధానాలను ప్రకటించినప్పుడే కొత్త రాజకీయ ప్రయోగానికి అర్థం ఉంటుంది.

ఆడిటర్ లెక్కలు.. రాజకీయాల్లోనూ సరిపోతాయా?

బ్యాలెన్స్ షీట్ లెక్కలకు రాజకీయ సమీకరణాలు భిన్నం! ఆడిటర్‌గా విజయసాయిరెడ్డి అనుభవం ఆయన వృత్తిపరమైన నేపథ్యానికి సంబంధించినది. అయితే, రాజకీయాలు ఆర్థిక లెక్కల మాదిరిగా ఒకే సూత్రంతో నడవవు. అక్కడ ఒకటి ప్లస్ ఒకటి ఎప్పుడూ రెండు కావు.. కొన్నిసార్లు సున్నా కూడా కావచ్చు. ఇద్దరు నాయకుల మద్దతు కలిసినంత మాత్రాన ఓట్లన్నీ ఒకే దిశలో పడతాయని చెప్పలేం. ఒక సామాజికవర్గం మద్దతు ఉందని భావించినంత మాత్రాన ఆ వర్గంలోని ప్రతి ఓటరు ఒకే నిర్ణయం తీసుకుంటాడని అనుకోలేం. రాజకీయాల్లో వ్యక్తిగత విశ్వసనీయత, స్థానిక నాయకత్వం, పార్టీ నిర్మాణం, ప్రజా సమస్యలపై స్పందన, ఎన్నికల సమయంలో ఏర్పడే పరిస్థితులు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో విజయసాయిరెడ్డి రాజకీయ లెక్కల్లో తప్పులు వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, ఆ విమర్శలకు సమాధానం చెప్పాల్సిందీ



మాటలతో మాత్రమే కాదు.. కార్యాచరణతో కూడా. ఆయన నిజంగా కొత్త పార్టీని స్థాపించాలనుకుంటే, ముందుగా సిద్ధాంతపరమైన పత్రాన్ని ప్రకటించాలి. పార్టీ ఎందుకు అవసరం? ఇప్పటికే ఉన్న పార్టీల కంటే ఏ విషయంలో భిన్నంగా ఉంటుంది? ప్రజలకు ఏ కొత్త అవకాశాలను అందిస్తుంది? సామాజిక న్యాయంపై దాని వైఖరి ఏమిటి? నాయకత్వ నిర్మాణం ఎలా ఉంటుంది? ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటే క్షేత్రస్థాయిలో ఎంత బలం ఉంది? వంటి ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేసుకోవాలి. అలాగే, తనను బాల్ ఠాక్రేతో పోల్చుకోవడం కంటే, తనదైన రాజకీయ నమూనాను ప్రజల ముందు ఉంచాలి. రాజకీయాల్లో నిలదొక్కుకోవడానికి పేరు సరిపోదు.. ప్రజల నమ్మకం, స్పష్టమైన సిద్ధాంతం, బలమైన సంస్థాగత నిర్మాణం అవసరం. విజయసాయిరెడ్డి రాజకీయ భవిష్యత్తు ఈ అంశాలపైనే ఆధారపడి ఉంటుంది. విసా నినాదం నిజమైన రాజకీయ ఉద్యమంగా మారుతుందా? లేక ప్రశ్నలు, విమర్శల మధ్యే నిలిచిపోతుందా? అన్నది ఆయన తీసుకునే తదుపరి నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.



హేజిల్‌వుడ్ హవా..

• దక్షిణాఫ్రికా విలవిల! • ఆసీస్ భారీ విజయం

డర్బన్ టెస్టులో ఆస్ట్రేలియా పేసర్ జోష్ హేజిల్‌వుడ్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో దక్షిణాఫ్రికాను కుప్పకూల్చాడు. 421 పరుగుల చారిత్రాత్మక లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 206 పరుగులకే ఆలౌటైంది. దీంతో ఆస్ట్రేలియా 214పరుగుల ఘనవిజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో హేజిల్‌వుడ్ 49 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టి కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. ఒకవైపు ఐడెన్ మార్క్‌రమ్ 237 బంతుల్లో 75 పరుగులతో అద్భుత పోరాటం సాగించగా, మరోవైపు వీఅన్ ముల్డర్ 110 బంతులు ఎదుర్కొని ఆసీస్ బౌలర్లను నిలువరించే ప్రయత్నం చేశాడు. వీరిద్దరి ఐదో వికెట్ భాగస్వామ్యం 69 పరుగులకు చేరడంతో దక్షిణాఫ్రికా శిబిరంలో ఆశలు చిగురించాయి. అయితే ముల్డర్‌ను హేజిల్‌వుడ్ పెవిలియన్‌కు పంపడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. కొత్త బంతి చేతికందిన తర్వాత ఆసీస్ పేసర్ మరింత పదునుగా విరుచుకుపడ్డాడు. మార్క్‌రమ్ పోరాటానికి తెరపడటంతో దక్షిణాఫ్రికా పతనం వేగం పుంజుకుంది. అంతకుముందు మాట్ రెన్‌షా తొలి ఇన్నింగ్స్‌లో 190, రెండో ఇన్నింగ్స్‌లో 82 పరుగులు చేసి బ్యాటింగ్‌లో అదరగొట్టడంతో పాటు రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు కూడా పడగొట్టాడు. 2018 వివాదం తర్వాత దక్షిణాఫ్రికా గడ్డపై తొలి టెస్టు ఆడిన ఆస్ట్రేలియా అదిరిపోయే విజయంతో సిరీస్‌ను ప్రారంభించింది. కెప్టెన్ టెంబా బవుమా సారథ్యంలోని ప్రపంచ టెస్టు ఛాంపియన్ దక్షిణాఫ్రికాకు ఇది తొలి టెస్టు ఓటమి. డర్బన్‌లో హేజిల్‌వుడ్ పేస్ ముందు ప్రొటీస్ పట్టు కోల్పోగా, ఆసీస్ ఆధిపత్యానికి తిరుగులేకుండా పోయింది.

ఢిల్లీ క్యాపిటల్స్‌కు యువీ

కోచ్‌గా కొత్త అవతారం!

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే ఢిల్లీ క్యాపిటల్స్ తన కోచింగ్ బృందంలో భారీ మార్పులతో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. భారత క్రికెట్‌లో సిక్సర్ల సునామీ సృష్టించిన మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌కు కీలక బాధ్యతలు అప్పగించింది. జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా, బ్యాటింగ్ కోచ్‌గా యువీ వ్యవహరించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఇప్పటికే హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన సౌరవ్ గంగూలీతో కలిసి యువరాజ్ జట్టు విజయాల కోసం పనిచేయనున్నాడు. మైదానంలో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించిన యువీ.. ఇక యువ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం నింపుతూ బ్యాట్‌తో దూకుడు ఎలా ప్రదర్శించాలో నేర్పించనున్నాడు. ఆటగాడిగా ఎన్నో చిరస్మరణీయ విజయాల్లో భాగమైన అతడికి కోచ్‌గా ఇది తొలి అధికారిక బాధ్యత. ఢిల్లీ క్యాపిటల్స్‌తో తనకు పాత అనుబంధం ఉందని, గంగూలీతో కలిసి పనిచేయడం ప్రత్యేక అనుభూతినిస్తుందని యువరాజ్ తెలిపాడు.



ప్రతిభావంతులైన ఆటగాళ్లతో పనిచేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నాడు. 2019లో క్రికెట్‌కు వీడ్కోలు పలికిన యువీ.. ఇప్పుడు కోచ్‌గా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నాడు. గంగూలీ వ్యూహాలు, యువీ బ్యాటింగ్ పాఠాలు కలిస్తే ఢిల్లీ క్యాపిటల్స్ ఐపీఎల్ 2027లో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి!

నితీశ్ రెడ్డికి మరో ఛాన్స్

ప్లేయింగ్ ఎలెవన్ ఇదే!



వెస్టిండీస్‌తో సిరీస్ సమరంలో టీమిండియా మరో కీలక పోరుకు సిద్ధమవుతోంది. ఐదు టీ20ల సిరీస్‌లో ఇప్పటికే 21 ఆధిక్యంలో ఉన్న భారత్.. హైదరాబాద్‌లో జరిగే నాలుగో మ్యాచ్‌లోనే సిరీస్‌ను సొంతం చేసుకోవాలని పట్టుదలతో ఉంది. ఈ కీలక సమరానికి మాజీ భారత బ్యాటర్ చతేశ్వర్ పుజారా తన ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంపిక చేస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ముఖ్యంగా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని సూచించాడు. ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడిన నితీశ్ 30 పరుగులు చేయడంతో పాటు రెండు వికెట్లు పడగొట్టాడు.

''నితీశ్ బాగా ఆడాడు. అతడికి మరో అవకాశం ఇవ్వాలనుకుంటున్నా'' అని పుజారా స్పష్టం చేశాడు. టాప్ ఆర్డర్‌లో ఎక్కువ మార్పులు అవసరం లేదని అభిప్రాయపడ్డాడు. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా, ఇషాన్ కిషన్ మూడో స్థానంలో, శ్రేయస్ అయ్యర్ నాలుగో స్థానంలో, తిలక్ వర్మ ఐదో స్థానంలో ఆడాలని సూచించాడు.

37 ఏళ్ల వయసులో కొత్త ఇన్నింగ్స్

బిజినెస్ ప్రపంచంలోకి గ్రాండ్ ఎంట్రీ!



మైదానంలో పరుగుల వరద పారించిన విరాట్ కోహ్లీ.. ఇప్పుడు వ్యాపార రంగంలోనూ తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమయ్యాడు. 37 ఏళ్ల వయసులో తొలిసారిగా లింక్డ్‌ఇన్‌లో అడుగుపెట్టిన టీమిండియా మాజీ కెప్టెన్ తన భవిష్యత్ లక్ష్యాలను సుదీర్ఘ పోస్టు ద్వారా వెల్లడించాడు. భారత క్రీడా బ్రాండ్లను ప్రపంచ వేదికపై నిలబెట్టడమే తన ఆశయమని స్పష్టం చేశాడు. ''దార్శనికత స్పష్టంగా ఉంది.. మనందరినీ మించి నిలిచిపోయే నిర్మాణాన్ని సృష్టించాల్సిన సమయం వచ్చింది'' అంటూ తన కొత్త ప్రయాణానికి దిశానిర్దేశం చేశాడు. స్పోర్ట్స్‌వేర్ సంస్థ అజిలిటాస్‌లో పెట్టుబడిదారుడిగా చేరడంతో పాటు వన్ 8వరల్డ్ బ్రాండ్‌కు సహ వ్యవస్థాపకుడిగా, సృజనాత్మక భాగస్వామిగా వ్యవహరిస్తున్నాడు. కేవలం ఆటల్లో పాల్గొనడమే కాదు.. ప్రపంచ క్రీడా రంగ భవిష్యత్తును తీర్చిదిద్దడంలోనూ భారత్ భాగస్వామి కావాలన్నది కోహ్లీ ఆకాంక్ష. ఈ లక్ష్యంతో ప్యూమాతో ఎనిమిదేళ్లకు సంబంధించిన సుమారు రూ.300 కోట్ల ఒప్పందం పొడిగింపును వదులుకుని, అజిలిటాస్‌లో సుమారు రూ.40 కోట్ల సొంత పెట్టుబడి పెట్టినట్లు కథనం పేర్కొంది. తయారీ నుంచి ఉత్పత్తుల విక్రయం వరకు సమగ్ర క్రీడా వ్యాపార వ్యవస్థను నిర్మించాలన్నది ఈ సంస్థ లక్ష్యం. ఢిల్లీలో వన్ 8వరల్డ్ బ్రాండ్‌ను ఘనంగా పరిచయం చేసిన కోహ్లీ.. ఇప్పుడు తన క్రికెట్ అనుభవాన్ని వ్యాపార దృష్టితో మేళవిస్తున్నాడు. బ్యాట్‌తో రికార్డులు సృష్టించిన ఈ రన్‌మెషీన్.. భారత క్రీడా బ్రాండ్లకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే కొత్త ఇన్నింగ్స్‌లో ఎలాంటి మైలురాళ్లు అందుకుంటాడో ఆసక్తికరంగా మారింది.

రుక్మిణిగా ఆఫియా సయ్యద్.. కృష్ణుడిగా నితిన్!

- డిసెంబర్ 4న థియేటర్లలోకి 'అలియాస్ రుక్మిణి'
- నాని సమర్పణలో ప్రేమ, హాస్యం, భావోద్వేగాల సందడి!

నితిన్ కెరీర్‌లో మరో వైవిధ్యమైన ప్రేమకథగా తెరకెక్కుతున్న 'అలియాస్ రుక్మిణి'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నేచురల్ స్టార్ నాని సమర్పణలో వస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటి అఫియా సయ్యద్ కథానాయికగా నటిస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. తాజాగా విడుదలైన ఆమె పాత్ర పరిచయ గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఇందులో అఫియా ఓ కఠినమైన పాఠశాల ఉపాధ్యాయురాలు రుక్మిణిగా కనిపించనున్నారు. విద్యార్థుల దృష్టిలో ఆమె ఓ రాక్షసి.. హిట్లర్.. హోంవర్క్ పోలీస్! బోర్డుపై తన పేరు రుక్మిణి అని రాస్తూ, విద్యార్థులవైపు తీక్షణంగా చూసే ఆమె తీరు గ్లింప్స్‌లో ప్రత్యేకంగా నిలిచింది. మహాభారతంలోని రుక్మిణి పాత్రను గుర్తుచేసేలా కథానాయిక పాత్రను తీర్చిదిద్దగా, నితిన్ పాత్రకు కృష్ణుడు అనే పేరు పెట్టడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. పేర్లలోనే ఇంత ప్రత్యేకత ఉంటే.. తెరపై ఈ ఇద్దరి మధ్య ఎలాంటి రసవత్తరమైన పరిణామాలు చోటుచేసుకుంటాయన్నది సినీ అభిమానుల్లో ఉత్కంఠ కలిగిస్తోంది. 'ధండోరా'తో గుర్తింపు తెచ్చుకున్న మురళీకాంత్ దేవసోత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి ఘంటా యూనానిమస్ ప్రొడక్షన్స్‌పై నిర్మిస్తున్నారు. జోమోన్ టీ. జాన్ ఛాయాగ్రహణం అందిస్తుండగా, విజయ్ బుల్గానిన్ సంగీతం సమకూరుస్తున్నారు. తొలి గ్లింప్స్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌తోనే మంచి స్పందన అందుకున్న ఈ చిత్రం డిసెంబర్ 4న థియేటర్లలోకి రానుంది. మరి కృష్ణుడి అల్లరి.. రుక్మిణి గాంభీర్యం కలిసి వెండితెరపై ఎలాంటి వినోదాన్ని పంచుతాయో చూడాలి!





బాక్సాఫీస్ పోరుకు సై!

దసరా బరిలో నాలుగు సినిమాలు • పండుగ సీజన్ లో స్టార్ హీరోల సందడి
• రజనీకాంత్ జైలర్ 2, విజయ్ రణబాలి

దసరా పండుగ.. సెలవుల సందడి.. థియేటర్ల ముందు ప్రేక్షకుల కోలాహలం! ఈసారి బాక్సాఫీస్ బరిలో ఎవరు విజేతగా నిలుస్తారు? సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2'తో మాస్ మంత్రం వేయబోతుంటే.. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన 'రణబాలి' అంచనాలను పెంచుతోంది. వీటికి పోటీగా 'క్రేజీ కల్యాణం' నవ్వుల విందు అందించేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు జానపద గాయని జీవితాన్ని ఆవిష్కరిస్తూ 'గరివిడి లక్ష్మి' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. నాలుగు సినిమాలు.. నాలుగు విభిన్న కథలు.. ఒకే పండుగ సీజన్! ఇప్పటికే విజయాల కోసం ఎదురుచూస్తున్న తెలుగు చిత్ర పరిశ్రమకు ఈ సినిమాల ఫలితాలు కీలకంగా మారాయి. భారీ బడ్జెట్ చిత్రాలు ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తాయా? వినోదం, భావోద్వేగాలతో చిన్న సినిమాలు అనూహ్య విజయం సాధిస్తాయా? అంచనాలు ఒకవైపు.. పోటీ మరోవైపు.. చివరకు పసూళ్ల సింహాసనాన్ని అధిరోహించేది ఎవరు? దసరా బాక్సాఫీస్ సమరంలో అసలైన విజేత ఎవరన్నది ఇప్పుడు సినీ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది!



అక్టోబర్ 15న 'జైలర్ 2'

నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' అక్టోబర్ 15న తమిళంతోపాటు తెలుగు వెర్షన్‌లో విడుదల కానుంది. భారీ అంచనాలతో వస్తున్న ఈ చిత్రం యాక్షన్ అభిమానులను ఆకట్టుకోవాలని చూస్తోంది. రజనీకాంత్ స్టైల్, మాస్ ఇమేజ్ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలవనున్నాయి.

అక్టోబర్ 16న 'రణబాలి' రాక

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న నటించిన పీరియడ్ డ్రామా 'రణబాలి' అక్టోబర్ 16న థియేటర్లలోకి రానుంది. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. పెద్ద బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా దసరా వసూళ్లలో కీలక పాత్ర పోషిస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయిన తెలుగు చిత్ర పరిశ్రమకు 'రణబాలి' ఫలితం కీలకం కానుంది.


నవ్వులు పంచేందుకు 'క్రేజీ కల్యాణం'

దర్శకుడు బద్రప్ప గజుల తెరకెక్కించిన 'క్రేజీ కల్యాణం' అక్టోబర్ 16న విడుదల కానుంది. అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, నరేశ్ వీకే, అఖిల్ ఉద్దేమరి ప్రధాన పాత్రల్లో నటించారు. వినోదాత్మక కథాంశంతో రూపొందిన ఈ చిత్రం తొలుత అక్టోబర్ 30న విడుదల కావాల్సి ఉంది. అయితే పండుగ సెలవులను దృష్టిలో పెట్టుకుని విడుదల తేదీని ముందుకు జరిపారు.

జానపద గాయని జీవితమే 'గరివిడి లక్ష్మి'

అక్టోబర్ 17న విడుదల కానున్న 'గరివిడి లక్ష్మి' ఓ ప్రముఖ జానపద గాయని జీవిత కథను తెరపైకి తీసుకురానుంది. 1990లలో పాటలు, కథలు, సామాజిక అంశాలతో ప్రజలను ఆకట్టుకున్న గరివిడి లక్ష్మి ప్రయాణాన్ని ఈ చిత్రం ఆవిష్కరించనుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ సినిమాలో ఆనంది టైటిల్ పాత్ర పోషించారు. గౌరి నాయుడు జమ్ము దర్శకత్వం వహించగా, చరణ్ అర్జున్ సంగీతం అందించారు. జానపద సంగీతం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

దసరా సీజన్‌పైనే పరిశ్రమ ఆశలు



తెలుగు సినిమా పరిశ్రమకు దసరా, సంక్రాంతి సీజన్లు అత్యంత కీలకం. పండుగ సెలవుల్లో కుటుంబాలతో కలిసి సినిమాలు చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపుతుండటంతో నిర్మాతలు ఈ సమయాన్ని లక్ష్యంగా చేసుకుంటారు. ఈ ఏడాది పెద్దగా విజయాలు నమోదు కాకపోవడంతో రాబోయే చిత్రాలపై పరిశ్రమ ఆశలు పెట్టుకుంది. సంక్రాంతి సమయంలో కొన్ని సినిమాలు మంచి ఫలితాలు సాధించగా, మరికొన్ని నిరాశపరిచాయి. అక్టోబర్ 2న విడుదల కావాల్సిన వెంకటేశ్ నటించిన 'ఆదర్శ కుటుంబం ఏకే 47' సినిమా నిర్మాణానంతర పనుల ఆలస్యంతో వాయిదా పడింది. దీంతో ఇప్పుడు దసరా బాక్సాఫీస్ పోరులో 'జైలర్ 2', 'రణబాలి'తోపాటు మిగతా రెండు చిత్రాలు ఎలాంటి ఫలితాలు సాధిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.